అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 3 మార్గశిర శుద్ధ విదియ, 22 నవంబరు 2025

అవధాన భారతిని బంగారు పల్లకీలలో ఊరేగించిన శతావధానులు

తిరుపతి వేంకట కవులు



దివాకర్ల తిరుపతి శాస్త్రి (1872-1920) చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి (1870-1950)

కం. జలచర ధులి కిరి నరహరి
కలిత వటు త్రివిధ రామ కల్కులు బుద్ధుం
డిల తిరుపతి వేంకటశా
స్త్రులను పరబ్రహ్మశాస్త్రిఁ జూతురు పేర్మిన్

ప్రచురణ

అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్

శ్రీమాత్రేనమః





శృంగేరీ శ్రీ శారదాపీఠాధీశ్వరులు అనంతశ్రీవిభూషితులు శ్రీ భారతీతీర్థ మహాసన్నిధానంవారి కరకమల సంజాతులు
శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ సన్నిధానంవారు ధర్మవిజయ యాత్ర సందర్భంగా భాగ్యనగరం శ్రీశంకరమఠంలో
23.10.2025 తేదీన 'అవధాన పుష్కరిణి' సంచికను ఆవిష్కరించిన దృశ్యాలు

అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 3

విశ్వావసు - మార్గశిరం 2025 | 22-11-2025 | ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్

శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - త్వదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

- డా. జి.యం.రామశర్మ, శతావధాని

కార్యాలయం
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146

సంపాదకీయం



అవధానవిద్యా విజయతే తరామ్

భారతీ కటాక్షం

శారదా శారదాంభోజ వదనా వదనాంబుజే ।
సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధి స్సన్నిధిం క్రియాత్ ॥

అవధాన పుష్కరిణి పునీతమైంది. జగద్గురువుల దివ్యకరస్పర్శతో ద్వితీయ సంచిక లోకార్పితమైంది. దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీ శారదాపీఠాధీశ్వరులు అనంతశ్రీవిభూషితులు జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ సన్నిధానంవారు అవధాన పుష్కరిణికి ఆశీరనుగ్రహం అందించారు. శృంగేరీ పీఠంలో వేదవేదాంగ పారీణులైన విద్వద్వర్యులతో వాక్యార్థ మహాసభలు జరుగుతాయి. సమస్త శాస్త్ర పండితుల సమ్మేళనాలు, వేదాంత గోష్ఠులు జరుగుతాయి. సంగీత, సాంస్కృతిక, శాస్త్రీయ, సాంప్రదాయిక కళాప్రదర్శనలు విరివిగా జరుగుతాయి. వీటన్నిటితో పాటు సాక్షాత్తు శారదాంబా స్వరూపులైన భారతీ తీర్థ మహాసన్నిధానంవారికి, తత్కరకమల సంజాతులైన విధుశేఖర భారతీ సన్నిధానంవారికి సంస్కృతాంధ్ర భాషలకే మణిభూషణమైన అవధాన విద్య అంటే ఎంతో అభిమానం. అటు శృంగేరీ లోనూ వారి ధార్మిక విజయయాత్రల సందర్భంగా ఇటు ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ ఎన్నో అవధానాలు జరిగాయి. జరుగుతున్నాయి.

వారి దివ్యానుగ్రహంతో భాగ్యనరంలో, వారణాసిలో, శృంగేరీలో దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాస పత్రిక ద్వారా శతావధానాలు, అష్టావధాన సప్తాహాలు ఎన్నో నిర్వహించాము. ఇప్పుడీ అంతర్జాల పత్రికపై కూడా వారి వాత్సల్యమయ కటాక్ష వీక్షణాలు ప్రసరించడం అదృష్ట విశేషం.

ఇప్పుడు పద్యాలు వ్రాస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. నిష్కర్షగా సదసద్వివేచనమందించే పద్యవిమర్శలను, శాస్త్రవివేచనను అందించమని రచయితలను అభ్యర్థించాము. రాశిలోనూ వాసిలోనూ రసభావాత్మకంగా, హృద్యపద్యరచనా నిర్మాణంలో కల్పనా వైదుష్యంతో పాటు కావ్యగుణదోషాల అవగాహన నేటికవులకు ఎంతో అవసరం.

ముచ్చటగా మూడవ సంచిక భావితరాల అవధానులకు పనికివచ్చే అనేకాంశాలతో అందంగా ముస్తాబై మీముందుకొస్తుంది..

[signature]

సంస్తుతి

డా॥ ప్రసాదరాయ కులపతి గారి

శివసాహస్రి నుండి..

జయ ఫాల నయన! శ్రిత లోల నయన! సిత శైల శయన! శర్వా!
జయ కాల కాల! జయ మృత్యు మృత్యు! జయ దేవ దేవ! శంభో!
జయ చంద్రమాళి! సమదింద్రమౌళి మణిసాంద్ర హేళిచరణా!
జయ యోగ మార్గ జిత రాగ దుర్గ ముని యాగ భాగ! భర్గా!
జయ స్వర్గ వాసి మతి వర్గ భాసి ప్రతి సర్గ సర్గ కల్పా !
జయ పర్వతేంద్ర తనయా కుచాగ్ర పరికల్పనీయ శిల్పా!
జయ బంధు జీవ సుమ బంధు జీవ సమ సాంధ్య రాగ జూటా!
జయ చండ చండ తర తాండ వోగ్ర భర కంప మాస భువనా!
జయ హార హీర ఘనసార సారతర శారదాభ్ర రూపా!
జయ శృంగి శృంగి శ్రుతి భృంగి భృంగి భృతి నంది నంది వినుతీ!
జయ శాల కంఠ కలకంఠ కంఠ సుర సుందరీ స్తుత శ్రీ!
జయ భావ జాత సమ! భావజాత సుకళాజిత ప్రియాహ్రీ!
జయ దగ్ధ భావ భవ! స్నిగ్ధ భావ! భవ! ముగ్ధ భావ భవనా!
జయ రుండ మాలి! జయ రూక్ష వీక్ష! రుచి రుంద్ర రూప! రుద్రా!
జయ నాసికాగ్ర నయనోగ్ర దృష్టి జనితాగ్ని భుగ్న విభవా !
జయ ఘోర ఘోరతర తాప జాప తప ఉగ్ర రూప విజితా!
జయ కాంతి మాలి! జయ క్రాంతి కేళి జయ శాంతి శాలీ! శూలీ!
య సూర్య చంద్ర శిఖ సూచనాగ్ర నయలోచనాగ్ర! ఉగ్రా!
జయ బ్రహ్మ విష్ణు పురుహూత ముఖ్య సురసన్నుతాంఘ్రియుగ్మా !
జయ ఫాలనేత్ర! జయచంద్రశీర్ష ! జయ నాగభూష శూలీ!
జయ కాల కాల! జయ మృత్యు మృత్యు! జయ దేవ దేవ! శంభో!

ఇదీ క్రమణిక

అవధానపుష్కరిణి అన్ని సంచికలూ ఒకేచోట. ఈ QR కోడ్ స్కాన్ చేస్తే అంతర్జాలంలో ఇప్పటివరకు వచ్చిన అన్ని సంచికలూ ఒకేచోట కనపడుతాయి. అక్కడే చదువుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

సహృద్వాణి

పుష్కరాలు 12 ఏళ్ల కొకసారి వస్తాయి. భక్తుల మనః ఫలకాలను పునీతం చేస్తాయి. అవధాన పుష్కరిణి 'దత్తాత్రేయ సంకల్ప బలం' ఆంధ్రుల సాహితీ గంగా సంగమం అవధానం. తరతరాల తెలుగు వారసత్వసంపద నెలనెలా పుష్కరిణి. శతాబ్దుల నుండి సారస్వత లోకంలో నెలకొన్న రత్నసంపద. అవధాన పుష్కరిణిని ఆదరిద్దాం. భావితరాల అవధానులకు కరదీపికలుగా నిలుద్దాం. అవధాన జైత్రయాత్రా పతాకను ధరించి నిలుద్దాం. **– ఆర్. అనంతపద్మనాభరావు**
ప్రముఖ అష్టావధాని

ఇది "అవధాన పుష్కరిణి" ఇందు మనోజ్ఞ రసానుభూతిచే
కదలెడు ధర్మయుక్త రసగంధ మరంద పురాణ గాథలున్,
మది పులకింపజేయు రస మాధురులౌ బహు పద్యరత్నముల్
చదివినచాలు చిత్తము వశంబును తప్పును మాటలేటికిన్.
– మద్దూరి రామమూర్తి, శతావధాని

అవధాన పుష్కరిణి ద్వితీయ సంచిక అద్యంతం చదివించేలా ఉంది. ప్రతి శీర్షిక ఉపయుక్తంగా ఉంది.
– సంబరాజు రవి ప్రకాశ్

అవధాన పుష్కరిణి ఆద్యంతము పఠనీయంగా ఉన్నది. వ్యాసకర్తలందరూ నిశితదృష్టితో చాల ప్రామాణికములైన వ్యాసాలనందించారు. వర్ధమానావధానులకు ఇది చక్కని కరదీపిక. ఈ పత్రిక ప్రధాన సంపాదకులైన బ్ర॥శ్రీ॥ మరుమాముల దత్తాత్రేయ శర్మగారి కృషి బహుధా అభినందనీయం. ప్రతి వ్యాసాన్ని సంపూర్ణంగా చదివి ఆనందించాను **– డా.జి.యం. రామశర్మ**

అవధాన కల్పవృక్షం

సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని డా॥ జి.యం. రామశర్మ

జగదాశ్చర్యకరావధానకవితా సంపన్నులైన తిరుపతి వేంకటకవులు కవితార్థమై ఉదయించిన కారణజన్ములు. గజారోహణాది ఘన సత్కారాలను పొందిన విద్వత్కవులు. అవధాన విద్యాపితామహుడు, అభినవ పండితరాయలు అయిన శ్రీమాన్ మాడభూషి వేంకటాచార్యులు ఏర్పరచిన అవధాన స్వరూపాన్ని అనుసరిస్తూ అష్టావధాన శతావధానాల ద్వారా అవధాన సరస్వతిని తెలుగు నాట సర్వత్ర నవనవోన్మేషంగా నర్తన చేయించారు – నానారాజ సందర్శనం చేసి అమరనదీ ప్రవాహ సదృశమైన ఆశుకవితా ధారతో సాహితీ జగతిని సమ్మోహింపజేసారు. తెలుగు పద్యాన్ని ప్రజల మధ్యకు తీసుకొని వెళ్ళిన ప్రజ్ఞానిధులు వారు. వారు అవధానాలు చేసిన కాలం సాహిత్యప్రభల కాలవాలమై ఎంతోమంది కవులకు ప్రేరణ నిచ్చింది. అందుకే 'ఎక్కడ జూచినన్ కవులె – ఎక్కడ జూడ శతావధానులే' అంటూ శతావధాని శ్రీ వేలూరి శివరామశాస్త్రి గారు 'తిరుపతి వేంకట సూరు లేగు నా ప్రక్కలనెల్ల నీ కడుపు పండినదమ్మ! తెలుంగు దేశమా' అని కీర్తించారు.

శతఘంట కవనం ఆ మహాకవులకు కరతలామలకం, ఆశు కవిత్వాడంబరం వారికి నల్లేరుపై బండి నడక, సత్కావ్య నిర్మాణ చాకచక్యం వారికి షడ్రసోపేత భోజనం, కింకవీంద్ర ఘటా పంచాననులైన ఆ మహావధానులను ప్రశంసిస్తూ 'వానలో తడియని వారు మధ్గురు వధాన మృదూక్తి మరంద ధారలో – కడుగని వారు మాకెచట కానగ రారిల తెల్గునాడునన్' అన్న విశ్వనాథ వారి మాటలు అక్షరసత్యాలు. తిరుపతి వేంకటకవుల అవధాన పద్యపూరణలు సహృదయ వేద్యాలు,

సాహితీ భారతికి రసనైవేద్యాలు. వారికి ఒక అవధానంలో 'అంధుండర్ధనిశీథమందు గనె నయ్యర్కేందు బింబంబులన్!' అనే సమస్యనిచ్చి పూరించుమన్నారు. గ్రుడ్డివాడు అర్ధరాత్రి సూర్యచంద్ర బింబాలను చూడాలని దీని భావం. సమస్యలోని అసంగతత్వం అందరికి తెలిసినదే. దీనికి వారు చేసిన పూరణ ఎంత ఔచితీమంతంగా ఉందో చూడండి–

శా॥ పుంధర్మేత సరస్వతీ కవులతో భూపాల కుండాదితే
యాంధస్తీక్ష్ణ గభస్తి బింబముల దీవ్యద్వృత్తి వర్ణించి, స
ద్గ్రంథంబు ప్రచియింపుడీ యనగ, తద్గ్రంథానుసంధాన ని
ద్రాంధుం డర్ధనిశీధమందు గనె నయ్యర్కేందుబింబమ్ములన్

ఇందులో బిందుపూర్వక ధ కారం ప్రాస. ఒక రాజు పుంభావ సరస్వతులైన తన ఆస్థాన కవులను సూర్య చంద్రులను వర్ణిస్తూ కావ్యరచన చేయండని కోరాడు. ఆ కావ్యానుసంధాన దీక్షలో ఒక కవి నిద్రలోకి జారుకొని నడిరేయి కలలో సూర్య చంద్రులను చూసాడు అని పద్యభావం. నిద్రాంధుండు అనే పదముతో సమస్యకు పరిష్కారం లభించింది. నిద్రమత్తు చేత అంధుడైన వాడు కలలో సూర్యచంద్రులను ఒకేసారి దర్శించుటకు వీలున్నది.

ఇందులో పుంధర్మేత సరస్వతీ కవులతో అనే పదబంధం, ఆదితేయంధస్తీక్ష్ణ గభస్తిబింబముల– అనే పదబంధం వారి వ్యాకరణ పాండితీ ప్రకర్షకు నిదర్శనంగా నిలిచాయి. పుంధర్మ + ఇత–పుంధర్మాన్ని పొందిన సరస్వతీ రూపులైన కవులని అర్థం. ఆదితేయులంటే దేవతలు, అంధస్ శబ్దానికి అన్నమని అర్థం. చంద్రునిలోని అమృతమే దేవతలకు ఆహారం కాబట్టి అదితేయాంధశ్శబ్దానికి చంద్రుడని, తీక్ష్ణ గభస్తి (ప్రచండములైన కిరణములు కలవాడు) శబ్దానికి సూర్యుడని అర్థం. ఆదితేయాంధస్తీక్ష్ణ గభస్తి బింబముల – అంటే సూర్యచంద్ర బింబముల అని అర్థం – ఎంత మనోహరమైన పూరణ ఇది.

పై విధంగా అవధానులు సమయస్ఫూర్తితో తమ వ్యుత్పత్తిని సంధానించి నూతన పదోత్పత్తిని చేయగలిగితే అవధానం సువిధానమై విద్వదారణ లభిస్తుంది.

మనవి

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్ కు "అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం" అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

– సంపాదకులు

అవధానకళా చరిత్ర 3

శతావధాని

ఆముదాల మురళి

పృచ్ఛకులు అవధానిపై ప్రేమతో కూడిన వ్యంగ్య చమత్కారాలతో మాట్లాడే వారు. అవధాని సందర్భ వశాత్తు అనేకానేక విషయాల నుట్టంకిస్తూ సభారంజక ప్రసంగం చేసేవారు. అష్టావధాన సభ ఒక శాస్త్రవిజ్ఞాన, కవిత్వ, వినోదాల సమాహారమైన పండితసభగా భాసిల్లేది.

చివరకు అవధానాంశాల్లో నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, అప్రస్తుతప్రసంగం తప్పనిసరి అంశాలుగాను మిగిలిన నాలుగు అవధాని ఇష్టాన్ని అనుసరించి ఎన్నుకొనేవిగాను పరిణామం చెందాయి. వర్ణన, ఆశువు, న్యస్తాక్షరి, వ్యస్తాక్షరి, ఘంటాగణనం, ఛందోభాషణం, వారగణితం, యాంత్రికగణితం, పురాణపఠనం, నామసమీకరణం, శ్లోకానువాదం, పేరడీ, పాటకు పద్యం మొదలగు అంశాలలో ఏవో ఒక నాలుగింటిని అవధాని ఎన్నుకొంటున్నాడు. ఎటొచ్చి ధారణాంశాలు ఐదుకు తగ్గకుండా ఉంటున్నాయి. శతావధానాల్లో సైతం మూడు ధారణాంశాలు, ఒక ధారణేతరాంశం ఎన్నుకొని అంశానికి పాతిక పద్యాలు చొప్పున చెప్పడం 'డెబ్బై ఐదు ధారణ' చేయడం పరిపాటిగా మారింది.

అవధాన వికాసదశలో అవధానాంశాలపట్ల, అవధాన నిర్వహణ పట్ల అనేక పరిణామాల, ప్రయోగాల అనంతరం ఒక స్పష్టత ఏర్పడింది. ఈ స్పష్టత మలితరం అవధానులు తయారు కావడానికి ఎంతో దోహదం చేసింది. అవధానాల వల్ల పద్యాన్ని నిలబెట్టుకొనే ఒక మహత్తర ప్రాతిపదికకు అవధాన వికాసదశ తోడ్పడిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ దశలోని తీర్థఘట్టాల్లాంటి కొందరు అవధానులను, వారి అవధాన విశేషాలను తెలుసుకొందాం.

"1864-1870 సంవత్సరాల మధ్య వెలువడిన 'పురుషార్థ ప్రదాయిని' అనే పత్రిక ఒక సంచికలో మండ్యం కృష్ణమాచార్యులు అనేవారు చేసిన శతావధానం వివరాలు తొలిసారిగా ప్రచురితమైనాయి. జమీందారీ యుగంలో రిపోర్టయిన తొలి అవధానం ఇదే" అని సమగ్రాంధ్ర సాహిత్యం 12వ సంపుటంలో ఆరుద్రగారు పేర్కొన్నారు. కాని ఆ వివరాలు లభించలేదు. అందువల్ల కృష్ణమాచార్యులెవరో, వారి అవధాన స్వరూపమెట్టిదో తెలియరాలేదు.

మాడభూషి వేంకటాచార్యులు (1835-1895)

అవధానరచనలో మొట్టమొదట అష్టావధాన, శతావధానాలను పరిచయం చేసిన ఘనుడు మాడభూషి వేంకటాచార్యులు. దేవులపల్లి సోదరులు, దాసుశ్రీరామకవి, తిరుమల బుక్కపట్టణం రాఘవాచార్యులు, నాదెళ్ల పురుషోత్తమకవి తదితరులు మాడభూషి వారి శిష్యులు. తిరుపతివేంకటకవులు కూడా మాడభూషి వారి వెంట పాడు అవధానాన్ని చూసి అవధాన సాధన చేసినట్లు చెప్పుకొన్నారు.

మాడభూషి వారు 1835లో నూజివీడులో జన్మించారు. వీరి తండ్రి వల్లవీ వల్లవ విలాస కావ్యకర్తయైన మాడభూషి నరసింహాచార్యులు, తల్లి అలివేలుమంగమ్మ. ఈయన తర్కవ్యాకరణ మీమాంసా జ్యోతిషశాస్త్ర ప్రవీణుడు, ప్రాకృత, వైకృత, శౌరసేనా మాగధీ పైశాచీ ప్రముఖ అష్టభాషా వ్యాకరణ పరిజ్ఞాత, ఆంధ్రగీర్వాణ భాషా ప్రబంధ రచనా విచక్షణుడు, శతలేఖినీ పద్య సంధాన ధురంధరుడు, అష్టభాషావ్యస్తాక్షరీ విద్యానవద్యుడు, ద్విసంధాగ్రాహి, అనులోమ విలోమ పఠనా సమర్థుడని వీరి భరతాభ్యుదయ, కావ్య గద్యవల్ల తెలియుచున్నది.

1872 ఫిబ్రవరి 21వ తేది నూజివీటి సంస్థానం ఆగిరిపల్లెలో వీరి అవధానం జరిగింది. నూజివీటి సంస్థానాధిపతులు శ్రీరాజా నారయ్యప్పారావు బహద్దరువారు, వారి సోదరులు, పిఠాపురం రాజు శ్రీరాజా రావు వేంకటమహీపతి శ్రీ గంగాధర రామారావు బహద్దూరుగారు, నర్సరావుపేట జమీందారు శ్రీరాజా మల్రాజు కొండల్రావు బహద్దరుగారు, ఈ అవధానాన్ని తిలకించారు. ఈ అవధానంలో ఆచార్యులవారు సంస్కృతంలో 27 వృత్తాలు, తెలుగులో 20 వృత్తాలనే కాక 4 కీర్తనలను కూడా చెప్పిరి. ఆచార్యుల వారి ద్విసంధాగ్రాహిత్వమును గంగాధర రామారావు పరీక్షింపగోరగా, 'రంగరాయ చరిత్రము' నుండి ఒక సీసపద్యాన్ని ఆస్థాన పౌరాణికుడు రెండు మార్లు చదివెను. మాడభూషివారు దాన్ని అనులోమప్రతిలోమ భంగిని పఠించారు.

ఆ మరునాడు గంగాధర రామారావుగారు సభ ఏర్పాటు చేయించారు. ఆ సభలో మాడభూషివారు ఆంగ్లము, హిందీ, అరవములలో వ్యస్తాక్షరిని అవలీలగా చేశారు. ఆ సభలో మాడభూషివారిని 'అభినవ పండితరాయలు' బిరుదుతో సత్కరించారు. నిజానికి ఈ సభలో 'అష్టభాషావ్యస్తాక్షరి'ని నిర్వహించవలసి ఉండగా అన్ని భాషలు తెలిసి పృచ్ఛకులు దొరకలేదు.

వేంకటాచార్యుల వారి రచనల్లో ప్రధానమైనది భరతాభ్యుదయం (1885) ఇంకా వారు పుష్పబాణవిలాసము (1876), రామావధూటి తారావళి(27 సీసపద్యాలు), ఆనంద గజపతీంద్ర శతకం (65 సీసములు), వామన నాటకం, హంససందేశం. మదన మోహన చరిత్ర (వచనం) మొదలగు రచనలు చేశారు.

(సశేషం)

యయాతి చరిత్ర

డా. ఆచార్య ఫణీంద్ర

"మున్నీటి రాణియౌ మిన్నేరె యే వేల్పు
  నడుగు గెందామర నలరు తెనె –
బాస వాల్గము లెన్ను ప్రామిన్కు లే వేల్పు
  చెలువంపు బావాల గిలుక రవలు –
కడిది రక్కసి మూక మెడ చాల్పు లే వేల్పు
  చేనున్న సుడివాలు చికిలి కళుకు –
గమ్మ దెమ్మెర పూప దిమ్ము దా నే వేల్పు
  మంచు మించుల పాను పంచ దూది –
యతడు దానైన కర్తారు దలమి కూర్మి
బ్రోవ సత్య చింతామణి పొట్ల చెరువు
నందు దెందేపలుగ సిరుల్ గ్రందుకొనగ,
బుడమి వెలసె హుమామియా పుడమి
రేడు!"

పొనగంటి తెలగనార్య కవి రచించిన "యయాతి చరిత్ర" కావ్యంలో "అవతారిక" లోని 16వ పద్యం ఇది. తన నివాసస్థాన మైన పొట్లచెరువు (పటాంచెరువు) పరిపాలకుడైన 'హుమామియా' ప్రభువును కీర్తిస్తున్నాడు కవి ఈ సీస పద్యంలో.



అచ్చపు తెలుగువారమై యుండి కూడ ఇప్పుడు – అచ్చ తెనుగు పదాలకు సంస్కృత సమ శబ్దాలలో అర్థాలను చెప్పుకోవలసిన దుస్థితి మనది. సంస్కృతాంధ్ర సమ్మిళిత వ్యావహారిక భాషకు అలవాటుపడిన ఈనాటి తెలుగు వారికి ఈ పద్యం ఓ పట్టున కొరుకుడు పడదు. తెలగన కవి ఈ పద్యంలో పొందుపరచిన అచ్చ తెనుగు పదాలను వాటి అర్థాలను ముందుగా మనం అవగతం చేసుకొందాం.

"మున్నీటి రాణి" అనగా సముద్రుని భార్య. "మిన్నేరు" అనగా ఆకాశ గంగ. "అడుగు కెందామర" అనగా పాదమనే ఎర్ర తామర. "బాస వాల్గములు" అనగా భాష నుండి జాలువారు సమూహాలు. అంటే మంత్ర సదృశమైన మాటలుగా మనం చెప్పుకోవచ్చు. "ప్రామిన్కులు" అంటే వేదాలు. "పావాలు" అంటే పావుకోళ్ళు లేదా పాదరక్షలు. "గిలుక రవలు" అనగా గిలుకరించు లేదా మ్రోగే ధ్వనులు. "కడిది" అనగా కఠినమైన లేదా భయంకరమైన. "మెడ చాల్పులు" అంటే మెడల వరుసలు అనగా ఖండించి పడి ఉన్న కంఠాల సమూహాలుగా మనం అర్థం చెప్పుకోవచ్చు. "సుడివాలు" అనగా చక్రాయుధం. "చికిలి కళుకు" అంటే పదునుదనపు కాంతి. "కమ్మ తెమ్మెర" అంటే సువాసనతో కూడిన చల్ల గాలి.

"పూప" అనగా భక్ష్యం లేక ఆహారం. "దిమ్ము" అంటే మత్తెక్కునది. "కమ్మ తెమ్మెర పూప దిమ్ము" అంటే చల్ల గాలిని ఆహారంగా గ్రోలి మత్తెక్కువాడు – ఆదిశేషుడు అని అర్థం చెప్పుకోవచ్చు. "మంచు మించులు" అనగా మంచును మించిన చలువదనం గల అని అర్థం. "అంచదూది" అంటే హంస తూలిక అని అర్థం. "పాను పంచ దూది" అంటే హంస తూలికా తల్పం అని అర్థం చెప్పుకోవలసి ఉంటుంది. "కర్తారు" అంటే తురుష్క భాషలో "అల్లా". కాబట్టి "కర్తారుడు" అంటే దైవం అని అర్థం చెప్పుకోవచ్చు. "అలమి" అంటే అధీనంలోకి తెచ్చుకొని .. అన్న అర్థం చెప్పుకోవచ్చు. "తెందేపలు" అంటే కుప్పలు కుప్పలుగా లేక అపారంగా అని అర్థం. "గ్రందుకొను" అంటే నిండారు అని అర్థం. ఇట్లా ఒక్క పద్యంలోనే ఇన్ని అరుదైన అచ్చ తెనుగు పదాలను రుచి చూపిన మహానుభావుడు పొన్నగంటి తెలుగన. తెలగన .. సార్థక నామధేయుడు.

ఇక ఈ శబ్దపరిజ్ఞానంతో ఈ పద్య భావ సౌందర్యాన్ని పరికిద్దాం. "సముద్రుని భార్య యైన ఆకాశగంగ ఏ భగవంతుని పాదమనే ఎర్రతామరలో శోభిల్లు తేనెయో –

మంత్రాల వంటి వాక్కులతో చెప్పబడే వేదాలు ఏ భగవంతుని అందమైన పాదుకలు మ్రోయించు ధ్వనులో – భయానక రాక్షస సమూహాల ఖండించిన శిరస్సుల కుప్పలు ఏ భగవంతుని చక్రాయుధం యొక్క పదునుదనం యొక్క కాంతి రేఖలో – మలయ మారుతాన్నే ఆహారంగా గైకొని మత్తెక్కిన ఆదిశేషుడు ఏ భగవంతుని పాలిట మంచునే మించిన చల్లదనం గలిగిన హంస తూళికా తల్పమో – ఆ శ్రీమహావిష్ణువే తానైన సుల్తానుగా .. తన ఆధీనంలో గలిగి ప్రేమతో పోషిస్తున్నట్టి నిజమైన కోరిన వరాలిచ్చే దేవమణి (సత్య చింతామణి) వంటి పొట్లచెరువు (పటాంచెరువు అనే భూభాగం)లో అపారమైన ధన సంపదలు పొంగి పొరలగా .. ఈ భూమి మీద వెలసిన మహారాజు – 'హుమామియా'!" అంటూ తన రాజభక్తిని చాటుకొన్నాడు ఈ కావ్యకర్త ఈ హృద్యమైన పద్యంలో!

"నా విష్ణుః పృథ్వీపతిః" (విష్ణువు అంశ లేనివాడు పృథ్వీపతి కాలేడు) అన్న వేదోక్తిని ప్రగాఢంగా విశ్వసించే సనాతన ధర్మ సాంప్రదాయిక కవి పొన్నగంటి తెలగన. దానితో పాటు ఒక మహమ్మదీయ ప్రభువును సైతం విష్ణు స్వరూపునిగా సంభావించే విశాల దృక్పథం కూడ ఆయన స్వంతం!

పద్యపరిమళం

వృత్తులు

- అన్నమరాజు ప్రభాకరరావు

తానున్న లోకమంతయును రమ్యహర్మ్యములతోను, తనవారున్న లోకమంతయును పూరి గుడిసెలతోను నిండియున్నప్పు డొక డొక వినూత్నమైన యాలోచనతో తాను చూచిన హర్మ్యము వంటిదానిని అన్నివిధముల నివాస యోగ్యమును సౌకర్యవంతము నయిన మిద్దె నొకదానిని శక్తి కొలది తనవారికై నిర్మించును. అతడే దాని ద్రష్ట, స్రష్ట. అనంతరకాలములో మరి కొందరు కాలానుగుణముగ మరి కొన్ని హంగులను చేర్చవచ్చును, సుందరీకరించవచ్చును, నవ్యతలను కూర్చవచ్చును. వీరందరును గొప్పవారే యైనను తొలుత మిద్దెను నిర్మించిన వాడే మూలపురుషుడు. ఆదికవి.

అట్టి ఆదికవి యైన నన్నపార్యు డెన్ని విధములైన కావ్య లక్షణములను తాను సంస్కృత వాఙ్మయము నందు దర్శించినాడో వాని నన్నింటిని తా ననుసృజించిన రెండున్నర పర్వముల భారతమునందే చొప్పించి ఆస్వాదయోగ్యము చేసినాడు. వీనినే నన్నెచోడుడు, తిక్కనాదులు, నాచన సోముడు, శ్రీనాథుడు, పోతన నుంచి ప్రబంధకవుల వరకును అనుసరించి తమ శక్తికొలది క్రమేణ యే విధముగా భాషా సౌందర్యము నినుమడింప జేసిరో ప్రాచీనాంధ్ర కవిత్వాభిమానులకు చెప్పనక్కర లేదు.

నన్నయ ప్రయోగించిన కావ్యాలంకారములలో మొదటగా "కావ్య వృత్తు" లను పరిచయము చేయుట యిప్పటి యుద్దేశ్యము.

వృత్తులు కావ్య ప్రధానాంశమున కంగప్రాయములును, రచనాశ్రయములునై పరగుచుండును. చిత్తమునకు వికాస, విక్షేప, సంకోచ, విస్తరములను కలిగించు వ్యాపార విశేషములే "వృత్తు" లనబడును. "వ్యవహారో వృత్తి రుచ్యతే" అని అభినవగుప్తుని నిర్వచనము. వ్యవహారమనిన శారీరక మానసిక వ్యాపారములు. ఈ వృత్తులు రసస్ఫోరకములైయుండి రసానుగుణముగ మారు చుండుటవలన వీనిని నాలుగు విధములుగా ఆలంకారికులు పేర్కొనిరి. కైశికీ, ఆరభటీ, సాత్త్వతీ వృత్తులు "అర్థవృత్తులు" కాగా, "భారతీ" శబ్ద వృత్తి . వీనిని "కైశిక్యాది వృత్తు"లందురు. అర్థవృత్తులందు భావము దృశ్యమానమగుచుండును. శబ్దవృత్తి వాక్ ప్రాగల్భ్యము గలది

1.కైశికీవృత్తి–ఇది కరుణ,శృంగారరసములకు సంబంధించిన విశేషము. కోమలమైన స్థితిని వర్ణించును. తగిన విధముగనే సరళ పదప్రయోగము, అల్ప సమాస ప్రయోగము లేదా సమసరహితమై, భావవ్యక్తీకరణ స్పష్టముగ సులభ గ్రాహ్యముగ నుండవలెను.

వసంత తిలకము.

ఈ బాలు నెత్తుకొని యింటికి జన్న నన్నున్
నా బంధు లందఱు మనంబున నేమనా రె
ట్టీ బాలసూర్యనిభు నిట్టు లడించి పోవం
గా బుద్ధి వుట్టు నని కన్య మనంబులోనన్ (ఆది 5–29)

(వ. వందురి వగచుచున్న దాని పుణ్యంబున......)

కన్య యైన కుంతీదేవి దుర్వాస ప్రసాదిత మంత్ర ప్రభావమున సూర్యునిచే సద్యోజాత పుత్రుని పొందిన పిమ్మట ఆ బాలుని నగరులోనికి తీసుకొని పోయిన యెడల బంధుజను లేమందురో యని యొకవైపు, విడిచి పెట్టుటకు మనసురాక మఱియొక వంక ... చింతించుచున్న మానసిక స్థితి. ఎన్నుకొన్న ఛందస్సు కానీ, పద ప్రయోగము కానీ, సరళముగా నున్నవి. ఒక అల్ప సమాస మున్నను లేనట్లే. పద్యమంతయును చాలా సుకుమారముగా కరుణ రసమును చిప్పిల్లజేయుచున్నది.

2.ఆరభటీ వృత్తి – సంరంభవేగ సమన్వితములైన యుద్ధముల వర్ణన. రౌద్ర భీభత్స రసపోషణకు అనుకూలమైనది. తదను గుణముగనే ఉద్ధతమైన పదప్రయోగము, విరివిగా మహాప్రాణ, సంయుక్త ద్విత్వాక్ష ప్రయోగము, దీర్ఘసమాసములు, ప్రౌఢమైన నడక కలిగి ఉంటుంది.

మ. నరచాపప్రవిముక్త దారుణ బృహన్నారాచధారల్ భయం
కరదైతేయనికాయకాయములపై గప్పెన్ దిశల్ నిండ బం
ధుర ధాత్రీధరతుంగశృంగతట సందోహంబుపై గప్పు దు
ర్ధరధారాధరముక్తసంతత పయోధారావళిం బోలుచున్

(ఆది. 2–23)

నిరంతర కుంభవృష్టి కురియునప్పుడు మహాపర్వత శిఖరము లపై నొక్కసారిగా వ్రాలి వానిని కన్పింపనీయని మహామేఘ సందోహము వలె నరుని చాపము నుండి వెల్వడిన శరసమూహము భయంకరమైన దైత్యుల శరీరములను కప్పివేసినాయి.

ఈ పద్యము దేవదానవ సంగ్రామములో నరుని చాపవిద్యా కుశలతను, విక్రమమును వర్ణించునది.

సాధారణముగా యెటువంటి రసావిష్కరణమునకైనను చంపకోత్పలములనే యిష్టపడు నన్నయ్య యిక్కడ సందర్భోచితముగా దీర్ఘసమాసముల కనువైన మత్తేభవృత్తము నెన్నుకొన్నాడు. పరుషాక్షర ప్రయోగము, రేఫ బాహుళ్యము, ద్విత్వ సంయుక్తాక్షర ప్రయోగములు భీభత్స రసమునకు మరింత బలమును కూర్చుచున్నవి. **(సశేషం)**

3

విశిష్ట తెలుగు భాషా వైభవం- ఛందః ప్రాముఖ్యం

- డా. సంగనభట్ల నరసయ్య

పండితుల సంగతి చెప్పనక్కరలేదు. మహాకవులు కూడా ఛందఃప్రయోగప్రియులే. నన్నయ మహాకవి దేశి ఛందస్సులే అధికంగా వాడినా, వృత్తపద్యాలకు పెద్దపీట వేసాడు. తిక్కన విశేష ఛందాల ప్రయోగం తెలుగు సాహిత్యంలో విశిష్ట ప్రయోగం. పాలుకురికి ద్విపద పట్టాభిషేకం, శ్రీనాథుని సీసం, పోతన్న దండకాలు, తెలుగు సాహిత్య శోభను ఇనుమడింపజేసాయి. పెదమల్లినాథుడు, చరిగొండ ధర్మన, రామరాజభూషణులు శతలేఖిన్యవధానాలు, రాయలవారి సభలో, బయటా వచ్చిన పాండిత్య స్ఫోరకాలు, చమత్కారాలు, సమస్యాపూరణ పద్యాలు తెలుగువారి నోట నేటికీ నానుతున్నాయి. చాటువుల ఛందః చమత్కారాలకైతే లెక్కే లేదు. చాటువుల పద్యప్రాభవాలు వేనోళ్ల చాటుతున్నవే. (తెలుగులో చాటు కవిత్వమని నేనో గ్రంథం రాసాను. దానిలో వివరాలున్నాయి.) ఛందాల్లోని అసలు కవుల పేర్లు గుప్తంగా రాసినవి పద్యప్రాభవాన్ని చెప్పేవే.

అవధానాల సంగతి ఇంక చెప్పనవసరం లేదు. మనముందే ఆ మహాకవులు సద్యఃస్ఫూర్తితో, ధారతో, ధారణాపటిమతో, తడుముకోకుండా, తడబడకుండా అనేక ఛందస్సుల్లో వృత్తమైనా, జాతి ఐనా, ఉపజాతి ఐనా, విశేషవృత్తమైనా, గేయమైనా ప్రాశ్నికుల కోరికల ననుసరించి అల్లుతుంటే మనం నోరువెళ్లబెట్టాల్సిందేగా! వారి చేతులో కాగితం లేదు, కలం లేదు. అద్భుత కవిత్వం, అద్భుతమైన అల్లిక వారిని సరస్వతీమూర్తులుగా మనకళ్లముందే ఆవిర్భవింపజేయడం ఒక్క తెలుగు జాతికే చెల్లింది. వీటిక్కారణం ఛందస్సుల అల్లికే గదా!

ఛందశ్శాస్త్రంలో ప్రదర్శించే గణవ్యవస్థ, దేశ్యగణాల నిర్మాణం, దానికి ఏర్పాటు చేసిన ప్రస్తార వ్యవస్థ, సూర్య(త్రిమాత్రిక), ఇంద్ర (పంచమాత్రిక), చంద్ర (ఉపరిసంఖ్యామాత్ర). వ్యవస్థ సుమారుగా సరిపోయ్యేదే. అదే దేశి ఛందస్సులు గేయమూలాలు గలవన్న రహస్యాన్ని ఆవిష్కరిస్తుంది.

వంకాయ వండాను వరికూడు వార్చాను
తినమని చెప్పవే తడికో తడిక

– అని గేయరూపంలో పాడితే పామరులు గేయసౌందర్యానికి ఆనందిస్తే, పండితులు సీసపద్యమని శాస్త్రసౌందర్యానికి ఆనందిస్తారు. ఒక్కోపాదం రెండర్థాలుగా, ఒక్కో అర్థం, తిరిగి మరి ఒకరెండు అర్థాలుగా విడిపోయి, పాతిక భాగానికి యతులు, ప్రాసయతులు వేసి సీసం నడిపిస్తుంటే లయానందం పొందని తెలుగువారుంటారా?

నాలుగు పాదాలు నాలుగు విభాగాలుగా, విధాలుగా, నాలుగు అంశాలుగా వర్ణించి, పైగీతిలో ఉపసంహారం (ముగింపు) కేవలం ఒక్క సీసపద్యంలో 'నమూనా నిర్మాణం' గా ఉత్కృష్టంగా ఉంది. భావాలకు అనుగుణంగా, పరిమాణ ప్రమాణంగా వివిధ దైర్ఘ్యాలతో తెలుగు ఛందస్సులు కవులకు అందుబాటులో ఉన్నాయి.

కందం, (షడ్విధ కంద భేదాలు, ద్విపద, మంజరీ ద్విపద, తరువోజ, అక్కరలు (పంచవిధ భేదాలు,) ఉత్సాహ (త్రివిధ భేదాలు), త్రి, చతుష్పదలు, షడ్విధ షట్పదలు, చతుర్విధ విషమ గీతులు, ద్వివిధ సమగీతులు (ఆటవెలది, తేటగీతులు), దశవిధ ఉద్ధురమాలా ఛందాలు, నవవిధ రగడలు, నవవిధ సీసభేదములు, 21 యతి, ప్రాస లక్షిత సీసభేదములు, త్రిస్రాది పంచవిధ తాళగణభేదాలు, వీటికి తోడు సంస్కృతం నుండి అరువు తెచ్చుకున్న ఉత్పలమాలాది శతవిధ వృత్తభేదాలు, ఒక్కసారి పరిశీలిస్తే తెలుగు పద్యం ఎంత విస్తృతరూపమో అర్థమవుతుంది.

దేశిచ్ఛందలతో భాషా వ్యాప్తి

భాషాలేఖనం, పాఠ్యగ్రంథాలు, బడి చదువులు, చుట్టూ పరిసరాలలో తెలుగు భాష లేనపుడు ఆభాష వ్యాప్తిని కోల్పోయి, క్రమక్రమంగా కనుమరుగవుతుంది. అసందర్భంలో ఆ భాషీయులు మౌఖికసంప్రదాయంలో, దేశిచ్ఛందాలలో రచితమై తమ పూర్వులనుండి తమకు వారసత్వంగా అందిన శతక, యక్షగానాది రచనలను సమాజంలో ప్రయాణింపచేస్తుంటారు. అవే తెలుగుభాషను ప్రజలనుండి దూరం కాకుండా నిలుపుతాయి.

సౌత్ ఆఫ్రికా దగ్గరలోని మెడగాస్కర్ దీవుల పక్కగల మారిషస్ ద్వీపంలో, బ్రిటిష్ వారిచే వంచితులై తూర్పు కోస్తాంధ్ర నుండి వెళ్లి, ఆదేశపు పౌరులుగా స్థిరపడిన తెలుగువారు తమ భాషను బతికించుకోవడానికి, నరసింహ శతకం పఠించేవారు. మూడు తరాలుగా ఈశతకం తెలుగును నిలిపింది. దానిలోని సీస పద్యాలు సులభ కంఠస్థ యోగ్యాలై తరం, తరం అందుకున్నాయి. తమ భాషలో గానం చేయడాన్కి ఉత్తేజాన్నిచ్చాయి. సీసం గేయచ్ఛందం. మొత్తం పద్యం రాకున్నా ఏపాదమైనా, ఏపాదఖండమైనా, పై తేటగతి పాదాలైనా సులభకంఠస్థాలై మాతృభాషను నిలిపాయి. నేడు మారిషస్‌లో ఐదో తరానికి తెలుగును మిగిలాయి. నేడు ఆధునిక తెలుగును నిలుపు కుంటున్నారు అదేశ ప్రజలు.

(సశేషం)

కాశీలో దర్శనమ్ అవధాన సప్తకం

'శతావధాని' అవధాన బాలభాస్కర

శ్రీ ఉప్పలధడియం భరత్ శర్మ

87వ అష్టావధానం 26.07.2025

సంచాలకులు - ఎం.వి.ఎల్.ఎన్. ప్రసాదు (కడప)

1. నిషిద్ధాక్షరి: అష్టావధాని చేపూరి శ్రీరామ్

బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి త్రిభాషాపాండిత్యాన్ని త్రివేణీసంగమంతో పోల్చి చెప్పడం.

కం. ద్యుతటిని ద్యువాణి కాగా
ప్రతపనజయె తెల్గు గాగ, బ్రాతి వనజభూ
సతి యార్యభాష కాగా
స్తుత పద్మాకర వధాన సూరిత హెచ్చున్

2. సమస్య: శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం

తప్పని యన్న తప్పు, మరి తప్పని చెప్పక యున్న తప్పెయౌ

ఉ. ఎప్పుడు నిష్క్రియత్వమతి యేల? నిరుత్సుకవృత్తి యేల? మీ
కొప్పవొ ధర్మబాధ్యత? లయోగ్యులొ? చేవ నుడింగి యుండిరో?
చెప్ప సమర్థ మౌన మది చేటగు భూమికిc గాన, కాదులే
తప్పని యన్న తప్పు; మరి తప్పని చెప్పక యున్న తప్పెయౌ

3. దత్తపది: దండిభొట్ల దత్తాత్రేయ శర్మ

గంగ, గంగ, గంగ, గంగ - గంగావతరణం

మ. మును గంగా నఘముల్ హుళక్కి, పరమాత్మున్ జేరcగాc ద్రోవ, దే
వ నదీనాయిక విష్ణుపాదభవయై వ్యాపించి వె ల్గంగ , త
న్నును శంభుండు మదాపహారి యగుచున్ జుట్టంగ, వే గం గ ళా
ధునియై చేరెను భూమి భక్తసుజనస్తోమంబుకై గంగ యై

4. వర్ణన: అవధాని శారదా ప్రసన్న

కాశీక్షేత్రాన్ని శపించబోయిన వేదవ్యాసుని నివారించడానికి పార్వతీదేవి ప్రత్యక్షమై పిలిచిన సందర్భం

('శ్రీనాథుని' వేదపురాణశాస్త్ర పదవీ.....' పద్యానికి మారుగా)

మ. అల పంచాంగుళులైదు వేదములుగా నాహ్వానమున్ జేయcగా
విలసత్కంకణనాదముల్ ప్రణవసంవిద్ధ్వానముల్ సల్పcగా



పులకాంచత్తను బాదరాయణుcడు నేమో ముగ్ధతన్ జెంది య
య్యలఘుప్రాభవపార్వతీపదములే యంటంగ నేగెన్ వడిన్

5. న్యస్తాక్షరి: పంతుల విట్టుబాబు

చంపకమాల: 1-2-వ, 2-6-సు, 3-10-మ, 4-16-తి

తొలకరి చినుకుల వర్ణన

చం. న వ జలవాహబిందు పరిణద్ధ మృదాత్త సుగంధభూతి యు
ద్భవమయి శ్రీ సు రేంద్రకృప వర్ధిలుచుండె ననంగ, హర్ష సం
భవభృత శీత భావన మ మందగతిన్ బులకింపc జేయ, నూ
త్నవిధిని నంకురంబులకుc దద్దయు సమ్మ తి క్రాలదే ధరన్.

6. ఆశువు: భువనగిరి పురుషోత్తం

శృంగేరీ క్షేత్ర మాహాత్మ్యం

శా. రంగత్తుంగతరంగసంగతమహార్ఘప్రేష్ఠ తుంగానదీ
సాంగత్యంబునc బూతమై వెలయు విశ్వవ్యాప్తకీర్తిప్రభా
భృంగారోచిత పీఠికాస్థిలిని సంవీక్షించినన్ జాలదే
శృంగాహార్యజగద్గురూద్ధ పదరోచిన్ జూచినన్ జాలదే!

7. ఛందోభాషణం: చిత్రకవిసమ్రాట్ చింతా రామకృష్ణరావు

(ఈ ఛందోభాషణ, చంపకమాలా గర్భిత తేటగీతిగా గర్భకవిత్వ శైలిలో సాగింది)

పృచ్ఛకులు: ధర భరతుండవా?

అవధాని: "కవనధాత్రిని నేలెడి క్ష్మావిభుండ" నే



పృ: స్థిరవరభాషివా?

అ: "నుడుల చెల్వకుం బుత్రుcడ నోయి చూడc" గా

పృ: గురుచరణార్థివా?

అ: "గురులc గొల్చెద శారదకున్ బ్రతీక" గా

పృ: వరపరమాత్మవా?

అ: "నరుcడ బ్రహ్మవిచారి ననారతంబు" గా

8. అప్రస్తుతప్రసంగం:

కె.ఎల్. కామేశ్వర రావు

కాశీలో శ్రీ త్ర్యంబకేశ్వర హాల్‌లో జరిగిన

గురుసహస్రావధాని

నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అష్టావధానం

28.10.2025

సంచాలకులు: 'అవధాని ప్రాచార్య' ధూళిపాళ మహాదేవమణి

నిర్వాహకులు: జగన్నాథ శాస్త్రి

నిషిద్ధాక్షరి: **నిర్మల రామనాథ శర్మ గారు**

ప్రత్యక్షర నిషేధం చేశారు

శ్రీ నరేంద్ర మోదీ గారు కాశీ క్షేత్రమును లోక్ సభ నియోజక వర్గంగా ఎంచుకొని సనాతన ధర్మవ్యాప్తి చేయడం

కం: సాదిన్, మోచనభూమీ
మోదిన్, "కుపమాపదాస" పూర్ణాభిఖ్యున్
ఆది రఘువంశ రాజుల
పాదమ్ముల బాట వెలుగ ప్రార్థింతునిటన్

కుప – నరేంద్ర; మాప – దామోదర; కుపమాపదాస – నరేంద్ర దామోదర దాస మోదీ అని ప్రయోగించడం జరిగింది

సమస్య: **నరసింహదేవర జయలక్ష్మిగారు**

కుక్కుట గృహమందు కాకఘూకములుండెన్

కం. చక్కగ మైత్రిని నిలుపగ
కుక్కుటములు పిలువ, పగట కూడదటంచున్
తక్కిన వారల వీడుచు
కుక్కుట గృహమందు కాక, ఘూకములుండెన్

దత్తపది: **ఆకెళ్ళ వెంకట నాగమణి గారు**

పదాలు: కైక, కోక, లంగా, లుంగీ

గోపికా వస్త్రాపహరణ వర్ణన

శా. శృంగారాస్పద "**కోక**"నాదమయమౌ బృందావనంబందునన్
సంగక్రీడ చె"**లంగ**" నత్తఱిని ఘోషాయోషికావేషముల్
భంగంబైన వ్రతాన దోషమును బాపన్ రక్ష"**కైక**"స్థితిన్
చెంగున్ దూకి హరించు కృష్ణకథ"**లుం గీ**"ర్యమ్ము లానందముల్

వర్ణన: **బి. రాజరాజేశ్వరి గారు**

కాశీలో దేహత్యాగం చేస్తే మోక్షం కలగడాన్ని వర్ణించుట

తే.గీ. కాశికా భూమియె స్వయంప్రకాశమైన
ఆత్మ ప్రకృతిగ మారిన అవని కాన
పాప పుణ్య కూపమ్ములు బాసి పోవు
బడబ వహ్నిలో కాలని జడము కలదె?

న్యస్తాక్షరి: **సుధా మోహన్ గారు**

చంపకమాల: 1-3-స, 2-4-ద, 3-1-మ, 4-6-న

శివునికి, హిమాలయములకు గల సంబంధము

తన'**స**'తి పుట్టినిల్లు తన తాండవ కేళికి తగ్గ వేది, హై
మనగ '**ద**'రీ స్థలంబనుపమాన తపోఽగ్నికనుంగు భూమి, సా
'**మ**'నిగమ సోమదీప్తి యొక మన్నిక యైన నగాధిరాజమౌ
టను స్వనిధా'**న**'మయ్యెను జటాధర దేవునికమ్మహీధ్రమే!

ఆశువులు: **గిరిధర్ గారు**

1. గంగా కాలుష్యం

కం. నగపతి శీర్షాపగయౌ
విగతాఘ యమోఘ నేడు విషమయ యగుచో,
తగురీతి గావగావలె
భగవంతుని బాధపెట్టు భక్తి యదేలా?

2. ఐదుగురు వనితలు జ్ఞానవాపీ లోని శృంగార గౌరీ మాతను అర్చించుకోవడానికి కోర్టుకు వెళ్ళి గెలిచిన సంఘటన

కం. జననికి పంచన చేరగ
వనితాపంచకము చేరి బడసెన్ గెలుపున్
గననచ్చెరువే? వెలుగును
మణికర్ణిక భారతీయ మానినులందున్

3. యోగికి భోగికి పాలనలో తేడా

తే.గీ. సర్వ భూతహితరతమై సాగుచుండు
యోగి పాలించు పాలన యుత్తమముగ
ప్రేత భూత హితరతమై వీగు చుండు
భోగి పాలించు పాలన భూతలమున



ఘంటావధానం: **శైలజ**

యజ్ఞో వై విష్ణుః / జటా భుజంగ / మణికర్ణిక

అప్రస్తుత ప్రసంగం: **పేరాల బాలమురళీ కృష్ణ గారు**

నిఘంటు పరిజ్ఞానం

1 శతావధాని **ఆముదాల మురళి**

అలౌకిక త్వాదమరః స్వకోశే న యాని నామాని సముల్లిలేఖ ।
విలోక్యతై రప్యధునా ప్రచారం ఆయం ప్రయత్నః పురుషోత్తమస్య ॥

అమరకోశమును రచించిన అమరసింహుడు అలౌకిక పదములని(లోకవ్యవహారములో లేనివని) ఏ పదాలను విడిచిపెట్టాడో వాటికి లోకంలో ప్రచారం ఉండటం గమనించిన పురుషోత్తమ దేవుడు వాటిని సేకరించి నిఘంటువుగా నిర్మించారు. అమరకోశ శేషం కనుక దీనికి త్రికాండ శేషమని నామకరణం చేశాడు. ఈ నిఘంటువులో 1053 శ్లోకాలున్నాయి. అమరకోశం 1469 శ్లోకాలు.

అమరకోశంలో స్వర్గ, నాక, త్రిదివ, త్రిదశాలయ, ద్యౌ, సుర లోక, త్రివిష్టప, స్వః, దివ – అనే తొమ్మిది స్వర్గ పర్యాయములు చెప్పబడినవి. దీనికి పురుషోత్తమ దేవుడు మరో పది పేర్లు కలిపారు. స్వర్లోక, దేవలోక, అవరోహ, ఫలోదయ, మందర, సైరిభ, శక్రభవనం, ఖం, దివం, నభః – అనునవి. రెంటిని కలిపి చదువుకొంటే పందొమ్మిది స్వర్గపర్యాయ పదాలు అందుబాటులో ఉంటాయి. ఇలాగే స్వర్గ, దిగ్వర్గ, కాల, బుద్ధి, వాగ్వర్గ మొదలగు ప్రథమకాండ పదాలకు ద్వితీయకాండలోని భూ, పుర, శైలాది వర్గపదాలకు పురుషోత్తమ దేవుడు అనేక పదాలను జోడించాడు. ఆయా వర్గాల విభజన కూడా అమరకోశానుసరణంగానే జరిగింది.

మొదటి రెండుకాండల రచనలో అమరకోశాన్ని అనుసరించిన పురుషోత్తమ దేవుడు నానార్థవర్గు నందు తన ప్రత్యేక శైలిని పొందుపరచాడు. అమరసింహుడు పాటించిన 'క' అంత, 'ఖ' అంత అనే అంత్యవర్ణానుక్రమాన్ని పాటిస్తూ ఆద్యక్షర వర్ణక్రమాన్ని కూడా జోడించాడు. ఆ పద్ధతిని గూర్చి "స్వర కాద్యాది కాద్యంత క్రమా న్నానార్థ సంగ్రహం, విహాయామరకోశోక్త మకార్షీత్ పురుషోత్తమః" అని పేర్కొన్నాడు. అందు మొదటి శ్లోకం "శక్రార్కపర్ణయోశ్చార్కో ఽ భీకస్త్వభయకామి నోః । రైపకాంతికయోశ్చాంకోఽ లిమకోభేక కోకిలా॥" అని ఉన్నది. ఇందు వరుసగా అకారాది, కకారాంత పదములున్నవి. అవి – అర్క(దేవేంద్రుడు, జిల్లేడు చెట్టు), అభీక(భయము లేనివాడు, కాముకుడు), అంక(రూపక విశేషము, సమీపము), అలిమక(కప్ప, కోకిల), అంతిక(సమీపము, పొయ్యి).

పురుషోత్తముడు అమరకారునిచే లింగాది సంగ్రపము నందు విడిచిపెట్టబడిన పదములను క్రోడీకరించి చెప్పాడు. ఆజి, దరత్, జాతి, పురుత్, భాషా, సమా, శరత్, సికతా, వింశతి మొదలగు పదములు స్త్రీలింగములని, హాహా, హూహూ, గ్రంథి, పాణి, కలి, ధృతిమౌళి మొదలగు 53 పదములు పుంలింగములని, కలత్రం, విషం, బీజం, కటం, స్వం, రత్నం, తుల్యం, ఉక్తం మొదలగు 36 పదాలు నపుంసకలింగములని, దారు, జీవాతు, స్థాణు, సీధు, వాస్తు, హింగు మొదలగు 104 పదాలు పులింగ, నపుంసక లింగముల రెంటియందు వర్తించునని స్త్రీ, కేలి, మణి, యోని, మసి, ముని, మరీచి, శాల్మలి మొదలగు 59 పదాలు స్త్రీలింగము లని, నగర, ఆస్థాన, స్థల, పుర, పాటల మొదలగు శబ్దములు స్త్రీ మరియు నపుంసకలింగములందు వర్తించునని పేర్కొన్నారు.

పురుషోత్తమ దేవుడు త్రికాండ శేషము తర్వాత మరో మూడు నిఘంటువులు రచించి ఉన్నాడు. అవి 1. హారావళి, 2. ఏకాక్షర కోశము, 3. ద్విరూపకోశము. ఇందు హారావళిని ఇతని త్రికాండశేషమునకు అనుబంధంగా పేర్కొనవచ్చును. దీనిలో పద వర్గీకరణ కనిపించదు. ఇది 277 శ్లోకాల గ్రంథం. 224 శ్లోకాల వరకు పర్యాయపదాలు, మిగిలిన 53 శ్లోకాలు నానార్థాలు. వీటిలో ఏకశ్లోక, అర్ధశ్లోక, శ్లోకపాదగత పర్యాయ శబ్దాలుగా రచన ఉన్నది. ఉదాహరణకు "శతధామా చతుష్పాణిః పృశ్నిగర్భా గదాగ్రజః । గదీ కౌస్తుభవక్షాశ్చ, పాంచజన్యధరోఽ చ్యుతః" అన్న శ్లోకంలో ఎనిమిది విష్ణునామాలు చెప్పబడ్డాయి. 'వ్యాధో మృగవధాజీవః నిషాదః పుల్కసః ప్లవః' ఇందు శ్లోకార్థంలో 5 నిషాద వాచకాలు, 'తులినం, తుచ్ఛమిత్యాహుః' అన్న శ్లోక పాదంలో 2 నీచవాచకాలు చెప్పబడ్డాయి. ఇదొక విశిష్ట రచనా విధానం. దీన్ని ఎలా చదువుకోవాలన్న పద్ధతిని ప్రారంభంలో పురుషోత్తమ దేవుడు పేర్కొని ఉన్నాడు. **(సశేషం)**

తటిల్లతలు

ప్ర: మీ కాలు అంటే ఇష్టమా?

స: ఇంటిలోనూ, వంటింటిలోనూ ఆలు అంటే ఇష్టమే.

ప్ర: చాయకూ, జాయకూ పోలిక ఉందా?

స: వేడి చల్లారితే పనికిరానివి (జాయ = భార్య)

ప్ర: ఆలు, మిరియాలు, ధనియాలు – వీటి మూడిటిలో ఆలుంది గదా! పోలిక ఏముంది పదాల్లోనేనా?

స: మర్దన అన్నిటికీ గుణవృద్ధికరం

ప్ర: అవధానికి లైసెన్సుండాలా?

స: సెన్సుంటే చాలు; లై–సెన్సు అసలే పనికిరాదు.

(అష్టకాల నరసింహరామశర్మ గారి 'అవధాన సరస్వతి' నుండి)

పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

సమస్య

గణపతి పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్

పోచిరాజు కామేశ్వరరావు

ఫణి వర భూషణప్రవరు భర్గుని పెండ్లికి సేంద్ర సన్మరు
ద్గణ పరివేష్టి తామర సుగాయక కిన్నర కోటి తోడుతన్
గుణ గణ సత్ప్రభాయుత సుఘోర తపస్విని సర్వ ధాతుభృ
ద్గణపతి పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్

కవుతా రామకృష్ణ

మునిమఖరక్ష సేసి నృపముఖ్యపరాఙ్ముఖశైవచాపమున్
క్షణమున నెత్తి త్రుంచుటను గాధిజు నానతి, మెచ్చి రామునిన్
జనకుడు సీతనిచ్చుటకు సమ్మతి దెల్పగ నత్తరిన్ నృరాట్
గణపతి పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్.

గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

అణువణువందునన్ వలచె త్ర్యక్షుని గౌరి యపర్ణయౌచు తా
ప్రణతిని సేవలందలరి ఫాలుడు మెచ్చి! యనంగు సాక్షిగన్
గుణవతి నొందనొప్పగను గూర్చిన వేదిని శీత శైల ప్రాం
గణపతి పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్.

క్రొవ్విడి వెంకట రాజారావు, హైదరాబాదు

అణకువగల్గి లోకములకంత శుభమ్ములులాభసౌఖ్యముల్
ఘనముగనిచ్చు నందనుల కామ్యముదీర్చనొసంగె జన్మమున్
గుణవతియైన కూతురునకున్ నిపుడీవడి తృప్తిదేవతౌ
గణపతిపుత్రి పెండ్లి గనగా జనుదెంచిరి మౌనులున్ సురల్.

వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు

మునిజన వందితుండు హరి, ముచ్చట మీరగ రాఘవుండుగన్
జని గురువాజ్ఞతో హరుని చాపముఁ ద్రెంచ వివాహ హేతువై
జనకుడు సంబరంబునను సల్పగ పూజలు విఘ్నహర్తయెన్
గణపతి, పుత్రి పెండ్లి గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్.

మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో. జిల్లా

మణిమయ భూషణంబు లభిమాన మనస్కత నుజ్జగించి జ్యం
భణముగ గౌరి కానల తపంబొనరించి వరించె నంతటన్
ఫణిధరు డెంతయున్ మురిసి పల్లకిపై నరుదేర భూమి భృ
ద్గణపతి పుత్రి పెండ్లి కనగా చనుదెంచిరి మౌనులున్ సురల్.

పేరి భార్గవి, విశాఖపట్నం

గణపతి లక్ష్మి విష్ణు లను గాంచగ నేగుచు నుండ మౌనులుం
గణములు గూడ వెంటనట గ్రన్నన సాగిరి వింత శోభగన్
క్షణములు చేరువాయె నట సంపదలందున సర్వుడబ్ధి ప్రాం
గణపతి పుత్రి పెండ్లి గనగా జను దెంచిరి మౌనులున్ సురల్.

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

మణిమయ రత్న హారములు మన్నవు దుష్టుఁడు భర్తయైన స
ద్గుణములు చాలు మోదమని తుష్టినిఁ బొందఁగ నంచు నెంచి ప్రే
రణఁగని కూర్చ నుద్వహకు రామునిఁ బోలెడు వాని, మెచ్చఁగన్
గణపతి, పుత్రి పెండ్లిఁ గనఁగా జనుదెంచిరి మౌను లెల్లరన్.

ఈమని వేంకట మల్లికార్జున రావు, నెల్లూరు

ఫణిధరుడైనయీశ్వరుడుభవ్యవిరాజితదివ్యమూర్తియైజి
మణిమయభూషణమ్ములనుమంగళరీతినలంకరించియున్
గుణవతియైనహైమవతిగౌరివరించువేళలో కుభృద్
గణపతి పుత్రి పెండ్లిఁగనఁగాఁజనుదెంచిరి మౌనులెల్లరున్.

మదునూరి సూర్య నారాయణ శర్మ

ధనమును గల్గియుండియు సుధాత్రిని గొప్పగ పాలనమ్ముతో
మనమున సత్యవాక్కులను మాన్యత నొందుచు పల్కుచుండెనా
తృణముగ జూచుసంపదలు తృప్తిగనుండెడి రాజపుత్రుడౌ
గణపతి పుత్రి పెండ్లి గనగా జనుదెంచిరి మౌనులున్ సురల్.

కొనింటి రమేశ్

వినుతికి నెక్కినట్టి ఘన వీరుల వంశము కాకతీయనన్
గణుతికి నెక్కినందునను గౌరవమందెను రుద్రమాంబయే
గుణియని వీరభద్రునకు కొమ్మయె జోడని విందు జేయగా
గణపతి పుత్రిపెండ్లి గనగా జనుదెంచిరి మౌనులున్ యటన్!

కోటం రాజు లలితాపరమేశ్వరి, ఉప్పల్

గణముల నాథుడే శివునికై కడు ఘోర తపంబు జేయగా
గణపతి పార్వతీ కరము గైకొని ప్రేముడి స్వీకరించగా
ప్రణతులొనర్చి పర్వతము వారి వివాహము సల్పుచుండ నా
గణపతి, పుత్రి, పెండ్లి గనగా జనుదెంచిరి మౌనులున్ సురల్.

డా. రఘుపతి శాస్త్రుల, హైదరాబాద్

కణము కణమ్మునం దనను కాంతునిగా గను దీక్ష నెన్ని స
ద్గుణమతి చంద్రశేఖరుడు తోయజ నేత్రిని చేత పట్టు ప
ర్వణి దగు సంబరమ్ము కనులం గను వేడుక నా ధరాధరా
గణ పతి పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్

విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు

ప్రణవమనంగ నెవ్వరట, పార్వతియేమగు నద్రిరాజుకున్
గుణములు జూచి, యుక్తమని, కూరిమి గూర్చెదున్ కార్యమేమియో
ఘనుడగు రాముడొచ్చెనన, కౌశికు చెంతను నేమి యయ్యెనో
గణపతి పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులందరున్

సంకీర్త్ వింజమూరి

గణగణ మ్రోగు వాద్యముల గాంచి ముదంబున కాకతీయ ప
ట్టణము వెలుంగగా, విజయుడై తన రాజ్యమునందు నిల్చు స

ద్గుణమయ వేంగి వంశజుడు కూరిమినొప్పగ వీరభద్రుతో
గణపతి పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్

ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాద్

గుణములలోన దివ్యమగు కోమల మంగళ దీప్తి శోభతో
నణకువమీర నొప్పగను నద్భుతవైభవమంత గాంచగా
క్షణములలోన వార్త విని కాంక్షలు నిండగ మానసమ్మున
న్గణపతిబీ పుత్రి పెండ్లి గనగా జనుదెంచిరి మౌనులందరున్!

డా. అయ్యలసోమయాజుల సుబ్బారావు

గుణములకే యతీతుడవు గుంఫన పాఠము నేర్పుమో మహా
గణపతి! పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్
మణిమయమౌ సుకన్య తొలి మాన్యునిగా చ్యవనున్ వరించెనే
ప్రణతులు స్వీకరించి కలి బాధ శమింపవె పార్వతీసుతా!

విన్నకోట విజయసాగర్

గుణిఁ బెరకేలఁ బట్టి వల గుంజి గుణంబును గట్ట ఫెళ్ళనం
దొణకని రాముఁ గాంచి యతితుష్టి నొసంగెను వానికిన్ లస
ద్గుణమణి యైన సీత జనకుం డట నామిథిలాపురప్రజా
గణపతిపుత్రిఁ, బెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్

సూర్యదేవర రవికుమార్, గుంటూరు

ఘృణ యొకయింత చూపక మహేశుని దక్షుడు తూలనాడ దా
రుణహుతవాహుకీల బడి రూపము బాసి సతీపురంధ్రి తీ
క్షణ తప మాచరించి మరుజన్మ శివున్ వరించ భూమిభృ
ద్గణపతి పుత్రి పెండ్లి కనగా జనుదెంచిరి మౌను లెల్లరున్.

డాక్టర్ వరలక్ష్మి హరవే హరి, బెంగుళూరు

గుణగణ జాతకమును కూర్చగఁజూచిరి పెండ్లి సేయఁగన్
తృణముగ నప్పెనంచు మరి తృప్తిగ లక్ష్మికి విష్ణుమూర్తికిన్,
రణమది లేని జీవనము రమ్యపు సాగర రాజు కోరెనే
గణపతి, పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి, మౌనులున్ సురల్

కళ్యాణి కరణం, సంగారెడ్డి

రణమున సైనికుండట కరాళమతిప్పుచు చండివోలెనన్
పణముగ ప్రాణ ధైర్యముల భారము లేకను వెట్టుచుండగా
కణకణదేశభక్తి, నరకాసురులన్ ధరకూల్చు వాడు, యా
గణపతి పుత్రి పెండ్లి గనగా జనుదెంచిరి మౌనులున్ సురల్

ప్రబల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఉండవల్లి సెంటరు

విని ముని మాట, రాఘవుడు వేడిమి కన్దొర విల్లు విర్వగన్
జనకుడు, రామచంద్రునికి జానకి తోడ వివాహ బంధమున్
పనిగొన జేయ మిత్రపరివారము, బంధువులున్ విదేహ రా
ట్గణపతి పుత్రి పెండ్లి గనగా చనుదెంచిరి మౌనులున్ హితుల్.

దేవరకొండ భగవాన్

మణిమయ భూషణంబు లగు,మాధురు లందున వాంఛ లేకయే
గుణమున దైవ రూపుడని కొల్చి రి భూపరి పాల నాధికుల్
ఫణి వరుబోలు జ్ఞాన,ప్రతిభా పరిపూర్ణుడు శాస్త్ర శోధనా
గణప తిపుత్రి పెండ్లిఁ గ నఁగాఁ జ నుదెంచి రి మౌను లున్ సురల్

సరస్వతీ రామశర్మ, సిద్ధిపేట

గుణమణియైన శాంతకునుకూరిమి తోడవు ఋష్యశృంగునిన్
మణిమయమంటపమ్మునసమంచితమైన వివాహవేడుకన్
ప్రణవ స్వరూప సూర్యకుల వంద్యుడు సజ్జనపోషకప్రజా
గణపతి పుత్రిపెండ్లి గనగాజనుదెంచిరి మౌనులున్ సురల్

డా. గాయత్రీదేవి

మనమున శంభునేనిలిపి మంజులరీతి తపమ్ముజేసె,తా
మునుమును నగ్నిసంస్థితగ ముగ్ధగిరీశుతనూజ నంతటన్
ఘనముగశాంకరిన్ శివుడుకైకొనువేళ గోత్రరాట్
గణపతిపుత్రి పెండ్లిగనగా జనుదెంచిరి మౌనులున్ సురల్.

జి. లింగేశ్వర శర్మ, సిద్దిపేట

ప్రణయసుధామృతారసవిరాజితమైనటువంటిపందిటన్
గణగణ మ్రోగుచుంగడనుకమ్మనిమంగళవాద్యఘోషలే
ప్రణతులుసేయగామొదటలక్షణమైకొనసాగనీయనీజి
గణపతి, పుత్రి పెండ్లిగనగాజనుదెంచిరిమౌనులున్ సురల్

రాకుమార, గోదావరిఖని

మణిమయరత్నదీప సుకుమారమనోజ్ఞమరంద రూపు నం
దణకువ ముద్దుసేయనడయాడెడి ధీరమనంబుగల్గు స
ద్గుణవతి నీలకంఠునకుకూల సుభాషిణియౌ మహిన్ శిలాం
గణ పతిపుత్రి పెండ్లిగనగా జనుదెంచిరి మౌనులున్ సురల్.

చెరుకూరి వేంకట సూర్యనారాయణ

అణకువ నందు, భాగ్యమున, నందమునందున సాటిలేని స
ద్గుణముల రాశి మా సిరికి తోయ జనాభునితోడ పెండ్లికై
గణముల నీ సముద్రుడు సగర్వముగా పిలువంగ వచ్చె, రా!
గణపతి! పుత్రి పెండ్లిఁ గనగాఁ జనుదెంచిరి మౌనులున్ సురల్.

వి.వి. సత్యప్రసాద్, మియాపూర్, హైదరాబాద్

అనయము కూర్మిఁ జూపుచు గృహస్థుడు గారముఁజేసి పెంచె, నా
తనయ వివాహమున్ జరుప, దగ్గర బంధులు వచ్చి రంతటన్
ఘనముగ బ్రాహ్మణుల్ చదువ,గట్టిగ స్తోత్రముఁజేయ వచ్చె, నా
గణపతి, పుత్రిఁపెండ్లి గనగాఁజనుదెంచిరి మౌనులున్ సురల్!

సమస్య (పూరణలు 15 డిసెంబరు 2025 లోపు పంపాలి)
తల్లినిఁ దన్ను పుత్రులకె దక్కును గౌరవ మీ వసుంధరన్

దత్తపది

'జనవరి - మార్చి - మే - జులై'
పదాలను ప్రయోగిస్తూ రామాయణార్థంలో తేటగీతి.

ధనికొండ రవిప్రసాద్, హైదరాబాద్

మునిజనవరిష్ఠ! గురువరా! మొదటి మారె
అస్త్రమును వేయ ధర్మమే అతివ యైన
తాటకిన్ గూల్చ? మార్చిన ధర్మ మిట్లు
రాజు లైన వారికి నెట్లు రాణ నిచ్చు?

గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

జనవరిష్ఠులు రామలక్ష్మణులనంగ
రాక్షసులఁ బరిమార్చియు రక్షఁ జేయ
మౌనియాగమ్ము మేలొంద పూనినారు
సూర్యతేజులై కూర్చిరి శుభములవని

క్రొవ్విడి వెంకట రాజారావు, హైదరాబాదు

సీతనేమార్చి లంకకు జేర్చినావు
మేలిడదు తమి రాజులై మెరయునపుడు
జనవరిష్ఠుడా రఘుపతి ఘనతనెంచి
ఆమె ననుప విభీషణు డన్న కనియె.

కవుతా రామకృష్ణ

దైత్యజనవరిష్ఠా!చనెద వెస కనక
మృగమునై మేదినీసుత మెప్పు గొనగ
రాము నేమార్చి త్రిప్ప నరణ్య మందు
విరజులై వరలెడువారి తెరగు గనగ

పోచిరాజు కామేశ్వర రావు

భూ జన వరిష్ఠుఁ డినకుల భూరి యశుఁడు
కనిన నే మార్చి యేణ మే దనుజులైన
సురలు నైనఁ గదియ లేరని రయ మడరఁ
బాఱఁ జాగెను ముదమంది వనము నందు

మంకు శ్రీను, కొప్పర్రు

జనవరిష్ఠుండు శ్రీరామ చంద్రవిభుడు
శూర్పనఖనొగినేమార్చి సొంపలరగ
పంపె సౌమిత్రి దెసకు ఆ వనితమేను
పొంగి మోజులై విరబూసె పొందుగోరి.

శంకర్ జీ డబ్బికార్, ఇబ్రాహీంపట్నం

జనవరిష్ఠుని సతికుజన్ దనుజ విభుడు
రాము నేమార్చి గొనిదెచ్చె లంకకంత
నాశ మేతెంచె విధికృత మాశబెంచె
విశ్రవసునిఁజూలై కర్మ వివశమొంది

పేరి భార్గవి, విశాఖపట్నం

జన వరిష్టుడు రాముడు చనగ నటవి,
కపటి రావణుడే మార్చి, కలికి సీత
నపహరింపగ, మేలని యవని జాత,
జాడ మోజులైన నగలు జారవిడిచె!

వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు

అంది జూలైనను నసురు లంత మొందు
చిక్కి మేటి వీరుడు రాము చేత రాజ!"
యాజి నేమార్చి క్షతినిజేయ నరికట్ట,
మునిజనవరిష్ఠుడంత రామునొసగమనె.

డా. గాయత్రీదేవి

జనవరిష్ఠుడు రాముడు వనమునందు
మునులనేమార్చి చరియించు ముష్కరులను
సూర్యవంశపు జూలయి చుట్టుముట్ట
మేలు మేలని పొగడిరి మేటిజనులు.

డా. రఘుపతి శాస్త్రుల, హైదరాబాద్

స్వర్ణ హరిణమ్ము వెదకగా భర్తయు జన
వరికలను సీత మార్చి విపన్న జూచె
గాని, మేలును యోచింప లేని యట్టి
జింక మోజు లైదువ నట చేర్చె లంక.

వి.వి. సత్యప్రసాద్, మియాపూర్, హైదరాబాద్

స్వామి కార్యార్థమై జనవరిగ హనుమ
దేహమును మార్చి గగనమే దివ్య పథము
యనుచు దివిజులై నట్టి వా రబ్బుర పడ,,
లంకలో కాలు మోపె వీరాంజనేయ!!

చెరుకూరి వేంకట సూర్యనారాయణ

సజ్జన వరిష్ఠుడగు విభీషణుడు, దుష్ట
రాక్షసుల పరిమార్చిన రాముఁజేరి
జన్మ ధన్యమే యగునని శరణు గోరె
లంక రాజులైనను నన్న రావణు విడి.

మదునూరి సూర్య నారాయణ శర్మ

మార్చి యేమి ప్రయోజన మమ్మ కైక!
రాముడుఁ జన, వరించును రాక్షసులను
దనుజులైపోవు రామసోదరులు గూడి
మేలు కలుగు భరతునకు మేలుకొమ్మ!

తూములూరు శేషయ్య శాస్త్రి

అంజనీ సుత యాంజనేయ విడువక, సృ
జన వరిష్ట మంత్రము 'రామ' జపము సేయు,

నిత్య రామార్చితము 'రామ' నేటి నామ
మే, యన తనూజులైరిల మేటి హనుమ.

కొనింటి రమేశ్

మేను వంచెను త్రుంచెను మేటి ధనువు
జనవరిష్ఠుడు రాముడు, జానకమ్మ
మార్చి,మార్చి చూసెను తన మనసుమురియ
చెలియలపరంజులై చెంత చేరినిలువ.

విన్నకోట విజయసాగర్

రాజన వరియించెనె? కాదు, భూజ రాము;
రాజులైన వారెందరొ రాజిల నిల!
లోనc గామార్చి రగిలెనె? కానె కాదు;
మెచ్చి రఘువంశధీరుని మేల్గుణముల !

డా. అయ్యలసోమయాజుల సుబ్బారావు

రావణాది రాక్షసులను, లంక జేరి,
పిలుకుమార్చిన రాముని వేడుకొనుచు
మేటి పౌరులు ద్విజులైరి మెచ్చుకొనిరి
సజ్జన వరివసితుడయ్యె సత్యుడటుల.

విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు

భూజనవరిష్ఠుcడే వడి పురమువీడి
కానయందుండ నేమార్చి ఖలుడతండు
మేటి రాముని భార్యను మెచ్చినంత
దనుజులైన వారినిజంపె దాశరథియె

సంకీర్త్ వింజమూరి

యుద్ధరంగమ్మునన్ మేటి, యుక్తిశాలి
సర్వ జనవరిష్ఠ దతడు సత్యపాలి
లంక రూపురేఖల మార్చి, రావణహర!
తేజులై రయోధ్యపురిని ద్విజులు మ్రొక్క

మాచవోలు శ్రీధరరావు, హైదరాబాద్

జనవరిష్ఠులే యన నా దశరథ సుతులు
మదిని దోచగ, రూపము మార్చి వాస్త
వాకృతి గొనిన పావని యంత, మేటి
దివిజులై యొప్పు వారికి తెలిపె నతులు!

గట్టెడి విశ్వంత్, హైదరాబాద్

తా జనవరిష్ఠుండు జనక తనయ దేర
రావణుని హతమార్చి శ్రీరామమూర్తి
మేల్చరిత్రమ్ముతో నిల మెలగినాడు
లవుడు కుశుడింక తనుజులై రాజిలంగ.

సూర్యదేవర రవికుమార్, గుంటూరు

జనవరిష్ఠుడౌ రాము డినకులుండు
మాయలేడికై చనగ నేమార్చి సీత
నపహరించెను మేకవన్నె పులి రావ
ణుడు, తరాజులైనవి గద పడతి కలలు.

కళ్యాణి కరణం, సంగారెడ్డి

మేను జలతారు, గన్నులు మీనరాశి
మార్చి కుసుమాల మాలలు పేర్చినట్టి
ధరజ నవ రింగురింగుల కురుల సొగసు
మనుజులై మనము బొగడ మనదువశమె

ప్రబల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఉండవల్లి సెంటరు

రూపు మార్చిన మారీచు రూపడిచిన
రాఘవుని సఖ్యమొనరించి రాజు లైరి
భానుజ విభీషణులు, మేలు పల్కు బల్కె
రాముడరి భంజన వరిష్ఠ రాట్టె యనుచు.

దేవరకొండ భగవాన్

తాటకిని బరిమార్చి, సదా గురువుల
మాట మేలొనరించని మది తలచిరి
మనుజులై, రక్కసులనెల్ల మట్టు బెట్టి
జన వరిష్ఠులై నిల్చిరి జగతి లోన

సరస్వతీ రామశర్మ, సిద్దిపేట

జనవరిష్ఠునినే మార్చి జగడమాడి
రెండు వరములబొందె దామొండికైక
మే లె?! సీత,లక్ష్మణుగూడి లీలదెలుప
రా జులై యేల గావలె రామ విభుడు

జి. లింగేశ్వర శర్మ, సిద్దిపేట

రాజులై వెలగవలెను రాముని వలె
మేలు సలుపుచు ప్రజలకు పాలనమున
మార్చి వేయక నీతి సామాన్యునివలె
యోజన వరిష్టముగ సాగె యోగ్యముగను

రాకుమార, గోదావరిఖని

జనవరిష్ఠుడౌ రఘురామచంద్రు సుతులు
లవకుశలు దుష్టపాలకుల పరిమార్చి
మిత్ర పరివార యతులకు మేలొనర్చి
రామరాజ్యమునకు మహరాజులైరి.

దత్తపది: 'పాలు – పెరుగు – వెన్న – నేయి' పదాలను నచ్చిన ఛందస్సులో అన్యార్థంలో ప్రయోగిస్తూ ఒక నీతిని బోధిస్తూ.. (పూరణలు 15 నవంబరు 2025 లోపు పంపాలి)

పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 1

- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్



ఈ వ్యాసంలో కొన్ని సంధులు, కొన్ని అపశబ్దాలు చూద్దాం.

సంధులు: సకారాంత శబ్దాలు

శిరస్ + ఛేదము = శిరచ్ఛేదము అని వ్రాస్తుంటారు. ఇది సరి కాదు. శ్చుత్వసంధి వలన శిరశ్ఛేదము అవుతుంది. (సకారానికి చ, ఛ లు పరమైతే సకారం శకారం కావడాన్ని శ్చుత్వసంధి అంటారు) లేదా శిరస్ శబ్దానికి శీర్ష ఆదేశం వలన శీర్షచ్ఛేదము (తుగాగమ సంధి) అవుతుంది.

నిస్ + స్పృహ = నిస్పృహ అనకూడదు. నిస్స్పృహ లేదా నిఃస్పృహ అనాలి. (సకారంపై సకారం పరమైతే సకారంకు మార్పు ఉండదు, లేదా సకారానికి రేఫము, రేఫకు విసర్గ వరుసగా ఆదేశం అవుతాయి). ఇలాగే నిస్ + స్వార్థము = నిస్వార్థము అనకూడదు. నిస్స్వార్థము లేదా నిఃస్వార్థము అనాలి.

దుస్ + స్వప్నము = దుస్వప్నము అనకూడదు. దుస్ స్వప్నము లేదా దుః స్వప్నము అనాలి; మనస్ + స్థితి = మనస్థితి అనకూడదు. మనస్స్థితి లేదా మనః స్థితి అనాలి.

పయస్ + ఓఘము - దీన్ని కొందరు పయః + ఓఘము = పయోఘము అని వ్రాస్తారు. అలా వ్రాయకూడదు. దీన్ని పయఓఘము లేదా పయయోఘము అనాలి. ఈ విషయం గత వ్యాసంలో వివరించబడింది.

మేధస్ + మథనము = మేధోమథనము అని వ్రాయకూడదు. మేధా + మథనము = మేధామథనము అని వ్రాయాలి.

జశ్త్వసంధి: ఉత్ + జ్వలము = ఉజ్జ్వలము అవుతుంది. ఉ జ్వలము అనకూడదు. తకారం తరువాత జకారం వస్తే తకారం జకారం అవుతుంది. అప్పుడు జకారానికి ద్విత్వం వస్తుంది.

జగత్ + అంబ = జగదంబ అవుతుంది. జగదాంబ అనకూడదు. ఇక్కడ దీర్ఘం రాదు.

అనునాసిక సంధి

నీళ్ళు గలది అనే అర్థంలో అప్ + మయము = అమ్మయము అవుతుంది. అప్మయమో అబ్మయమో కాదు. మయట్ ప్రత్యయం వల్ల ఇక్కడ సంధి నిత్యము.

రాట్ + నికరము = రాణ్ణికరము అవుతుంది. కానీ రాణ్ణికరము అని కొందరు తప్పుగా వ్రాస్తున్నారు.

వృద్ధి సంధి

మమ + ఏకం = మమేకం అనకూడదు. మమైకం అనాలి.

ఛత్వసంధి

మత్ + శక్తి = మచ్ఛక్తి లేదా మచ్శక్తి అవుతుంది. మత్శక్తి కాదు. (మత్ + శక్తి = మద్ శక్తి (జశ్త్వం) = మజ్ + శక్తి (శ్చుత్వం) = మచ్ శక్తి (చర్త్వం) = మచ్ ఛక్తి (శకారానికి ఛకారాదేశం లేదా వికల్పంగా మచ్ శక్తి)

శబ్దాలు:

మండోదరి అనకూడదు. మందోదరి అనాలి. (మందం ఉదరం యస్యాః సా - మందమైన ఉదరం కలది). అర్థంతో సంబంధం లేని పదం అనుకొన్నప్పుడు మండోదరి అనవచ్చు.

మహత్వం అనకూడదు. మహత్త్వం అనాలి. (మహత్ + త్వ - అష్టా.5.1.119).

ఇట్లే సత్త్వము, సాత్త్వికుడు అనాలి. సత్వము, సాత్వికుడు అనకూడదు. విహగము, విహంగము, విహంగమము (పక్షి) ఈ మూడూ సరియైన పదాలే. ఇట్లే భుజగము, భుజంగము, భుజంగమము (పాము) ఈ మూడూ సరియే. (అష్టా.3.3.38)

జనార్థనుడు అనకూడదు. జనార్దనుడు అనాలి (అర్ద్ అనేది ధాతువు); స్మశానం అనకూడదు. శ్మశానం అనాలి. (శవాః యత్ర శేరతే = శవాలు ఎక్కడ నిద్రిస్తాయో అది. శవ శబ్దానికి శ్మ ఆదేశం, శయన శబ్దానికి శాన ఆదేశం. అష్టా.6.3.109)

సామ్రాట్ అనకూడదు. సమ్రాట్ అనాలి. (సమ్ + రాజ్ + క్విప్. అష్టా.8.3.25); పుల్లింగము అనకూడదు. పుంలింగము అనాలి. (పుం + లింగ అనాలి కానీ, పుత్ + లింగ అనకూడదు)

పాశ్చాత్యుడు అనకూడదు. పాశ్చాత్త్యుడు అనాలి. (పశ్చాత్ + త్యక్ 4.2.98 వలన తకారానికి ద్విత్వం కనిపిస్తుంది)

సింధూరము అనకూడదు. సిందూరము అనాలి. (స్యంద్ ధాతువు. ధకారం రాదు);

నవరాత్రి ఉత్సవాలు అనకూడదు. నవరాత్ర + ఉత్సవాలు = నవరాత్రోత్సవాలు అనాలి.

శృతి అనకూడదు. శ్రుతి అనాలి. (ఆర్ధధాతుక ప్రత్యయం పరమైనప్పుడు "శ్రు" కు "శృ" ఆదేశం రాదు. అష్టా. 3.1.74)

గృహీతవ్యము అనకూడదు. గ్రహీతవ్యము అనాలి. (తవ్య ప్రత్యయం పరమైనప్పుడు సంప్రసారణం రాదు)

సాంతం అనాలి. చివరివరకు అని అర్థం. ఆసాంతం అనకూడదు. పునరుక్తి అవుతుంది.

(సశేషం)

ఒక భాషకు అనేక రూపాలు ఉంటాయి. అందులో ప్రమాణ రూపాలు, అప్రమాణ రూపాలు ఉంటాయి. నిజానికి ఈ అప్రమాణరూపాలు అంటే వ్యాకరణ రూపాలు సాధించుకున్నాక ....అలా సాధించుకోకుండా జనుల వ్యవహారంలో మిగిలిపోయినవి అన్నమాట. పదాలు పుట్టడం జనవ్యవహారం లోనే. అవి క్రమక్రమంగా శుద్ధి చేసుకోబడి శిష్టప్రయోగాలకు ఎక్కుతాయి.కొన్ని అలా జన వ్యవహారంలో ఉండిపోతాయి. జనుల వాడుకలో ఉన్న పదాలు కూడా చాలావరకు శిష్టంగానే ఉంటాయి. కొన్ని కొన్ని నుడులు జానపదాలలో నానుతూ ఉండడంవల్ల భాషాశాస్త్ర సూత్రాలలో చెప్పబడిన రీతిగా అర్థం మార్పు, అక్షరం మార్పు, అక్షరాల తారుమారు ఇలా ఎన్నో రకాలుగా మార్పులు చెందుతూ ఉంటాయి. భాష పరంగా ఇవి సహజ పరిణామాలు.



తెలుగుభాషకు ఎక్కువగా సంస్కృత, ప్రాకృత భాషలతో సంబంధం, ఆదాన ప్రదానాలు ఉంటాయి కనుక తెలుగుభాషకు అక్షరాలు ఎన్ని అనే ప్రస్తావన వచ్చినప్పుడు సంస్కృత ప్రాకృత భాషలలో అక్షరాల ప్రస్తావన కూడా అవసరంగా జరుగుతుంది. తెలుగుభాషకు సంస్కృత భాష తల్లి వంటిది కనుక సంస్కృతంలో అక్షరాలు 50 అని చిన్నయసూరి ముందుగా సంస్కృత భాషలోని అక్షరాలను వివరించాడు. ఆపై ప్రాకృత భాషకు నలువది అక్షరాలని, తెలుగునకు అక్షరాలు ముప్పది ఆరు అనీ సూరి వరుసగా చెప్పుకుంటూ వచ్చారు సంజ్ఞాపరిచ్ఛేదంలో

వ్యాకరణంలో చెప్పుకోవలసిన సాధారణ సంజ్ఞలు, వ్యాకరణ ప్రారంభంలో తెలుసుకో వలసిన ముఖ్య విషయాలను సంజ్ఞా పరిచ్ఛేదంలో చెప్పారు సూరి గారు.

పాణిని తన మాహేశ్వర సూత్రాలలో

1.అ ఇ ఉ ణ్, 2.ఋ ౡ క్, 3.ఏ ఓ ఙ్, 4.ఐ ఔ చ్, 5.హ య వ ర ట్, 6.ల ణ్, 7.ఞ మ ఙ ణ న మ్, 8.ఝ భ ఞ్, 9.ఘ ఢ ధ ష్, 10.జ బ గ డ ద శ్, 11.ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్, 12.క ప య్, 13. శ ష స ర్, 14. హ ల్ – అని 14 సూత్రాలలో అక్షరమాలను వివరించాడు.. వీటిలో ప్రతి సూత్రం చివర ప్రత్యాహారం కొరకు పొల్లుహల్లులు చెప్పాడు..అవి ప్రత్యేక వర్ణాలుగా లెక్క రాదు. పైన చెప్పిన సూత్రాలలో మొదరిసూత్రంలో అ నుండి నాలుగవ సూత్రంలోని చివర చ్ వరకు ఒక ప్రత్యాహారంగా చేసి ఆ మధ్యలో ఉన్న అక్షరాలను అచ్ లు అన్నారు..తెలుగులో అవే ఉత్వ ద్విత్వాలు వచ్చి అచ్చులు అయ్యాయి.

ఆపై 5 సూత్రంలో మొదలైన హ నుండి 14 వ సూత్రం చివర ల్ వరకు ప్రత్యాహారం చేస్తే ఆ మధ్యలో అక్షరాలు హల్. అవే తెలుగులో హల్లులు అయ్యాయి..

ఇలాగ అచ్చులు, హల్లుల విభాగం జరిగింది.

సంస్కృతంలో ఉన్న 50 అక్షరాలు:

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఏ ఐ ఓ ఔ అం అః.
– ఇక్కడి వరకు అచ్చులు.

క ఖ గ ఘ, చ ఛ జ ఝ, ట ఠ డ ఢ ణ,
త థ ద ధ న, ప ఫ బ భ మ, య ర ల వ శ ష స హ ళ – ఇక్కడి వరకు హల్లులు.

(ప్రత్యేక అవసరం లేదు కనుక ప్రాకృత అక్షరాలను పేర్కొనడం లేదు)

తెలుగు అక్షరాలు: 36.

అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అః

క గ చ ౘ జ ౙ ట డ ణ త ద న ప బ మ య ర ల వ స హ ళ.

సంస్కృత అక్షరాలలో ఉన్న ఋ ౠ , ఌ ౡ,విసర్గ, ఖ ఛ ఠ థ ఫ ఘ ఝ ఢ ధ భ శ ష లు అచ్చ తెలుగు అక్షరాలలో లేవు..అంటే ఈ అక్షరాలతో వచ్చే పదాలు ఏవి ఉన్నా అవి సంస్కృతం నుండి తెలుగులోనికి వచ్చాయి అని గ్రహించాలి.

ఉదాహరణ: ఋతువు, కంఠం, వాఙ్మయం, దుఃఖం ఇలాటివి అన్నీ.

అలాగే ఎ, ఒ, అరసున్న(c), ౘ, ౙ అక్షరాలు తెలుగుకు ప్రత్యేకం. ఈ అక్షరాలతో వచ్చే పదాలు అచ్చ తెలుగువి.

ఉదాహరణకు: ఎలుక, ఒంటె, ౘక్కెర, ౘాప మొదలైనవి.

ఈ విధంగా సంజ్ఞాపరిచ్ఛేదంలో ముందుగా అక్షరాలను పరిచయం చెయ్యడం జరిగింది.

తెలుగు వర్ణమాలలో ప్రత్యేకంగా చెప్పని ఱ తెలుగుకు ప్రత్యేకం.చెఱకు వంటి పదాలలో ఉంటుంది. ఇప్పుడు ఈ అక్షరాన్ని మనం వాడడం లేదు. అలాగే తెలుగు వర్ణమాలలో చెప్పబడిన ళ తెలుగు పదాలైన తాళము, గొళ్ళెం, పళ్ళెం వంటి పదాలలో కనబడే ళ.

(సశేషం)

పద్యపరిమళం

ఏదేవు కనుదోయి హిమధామ సోదరీ
కుటికా కవాటంబు కుంచెకోల
యేదేవు చరణాబ్జమిందిరా పుత్రికా
కాకోదరాంగద కూకుదంబు
యేదేవు చేకత్తి ఋభురాజ పౌత్రు భా
మకు బల్లచేతుల మంత్రసాని
యేదేవు నాభి పూవిగురు జేజేబువ్వ
క్రొవ్వెదగల యయ్యగారి కవ్వగారు
సేవకేదేవుడొందె నర్చావతార
మట్టి శ్రీ వేంకటాచలాధ్యక్షునకును
బరమమూర్తికి మామక భవ్యకావ్య
కన్య కళ్యాణమొనరింతు గౌరవమున

ఇది కాకుమాను మూర్తి కవి రచించిన రాజవాహన విజయం అనే ప్రౌఢ ప్రబంధం లోనిది. ఇది ఏ పురాణాం తర్గతం కాని కల్పిత గాథ. అత్యంత మనోహరమైన పద్యాలతో అద్భుతమైన రచనగా విలసిల్లింది. ఇందులో ప్రతీ పద్యం అద్భుతమే. ఊహాతీతమైన భావనాశక్తి, అసమానమైన పద్యధార ఈ కవి ప్రత్యేకతలు. ఎంత అందంగా ఉన్నాయంటే పద్యాలు ఏకబిగిన పూర్తి కావ్యాన్ని చదివిస్తాయి. అవనీశులు పిశాచాలు అని ఈసడించిన ఈ కవి తన కావ్యాన్ని వేంకటేశ్వర స్వామి వారికి అంకితం ఇస్తూ చెప్పిన పద్యం ఇది.

ఏ దేవుని కనుదోయి లక్ష్మి కుటీర కవాటానికి కుంచెకోల (తలుపుగడియ లాంటిది) అన్నారు కవి. విష్ణుమూర్తి రెండు కన్నులు సూర్యచంద్రులు.లక్ష్మి కుటీరం పద్మం. సూర్యుడు వచ్చినప్పుడు వికసించడం, చంద్రుడు వచ్చినప్పుడు ముకుళించడం పద్మం లక్షణాలు. అంటే సూర్యచంద్రుల రాకపోకలతో పద్మమనే కుటీరం తెరుచుకుంటుంది, మూసుకుపోతుంది. అందువల్ల ఆ నేత్రద్వయం లక్ష్మీ నివాస గృహానికి కుంచెకోల.

ఏదేవు చరణాబ్జమిందిరా పుత్రికా కాకోదరాంగద కూకుదంబు, విష్ణు పాదోద్భవం గంగ. అంటే ఇందిరకు కూడా ఆమె కూతురు. కాకోదరాంగదుడై న శివుని వివాహమాడింది. కూకుదము అంటే సాలంకృత కన్యాదానం అని నిఘంటు అర్థం. ఆ పాదం గంగకు కన్యాదానం చేసిందని అర్థం.

ఏదేవు చేకత్తి ఋభురాజ పౌత్రు భామ కు మంత్రసాని. ఋభురాజు ఇంద్రుడు. ఇంద్రుని కొడుకు అర్జునుడు. అర్జునుని సుతుడు అభిమన్యుడు. అతని భార్య ఉత్తర. ఈమె గర్భాన్ని విష్ణు చక్రంతో రక్షించినాడు కాబట్టి ఆ చేకత్తి ఈ భామకు మంత్రసాని.

విష్ణుమూర్తి నాభి నుండి బ్రహ్మ, బ్రహ్మ లలాటం నుండి శివుడు ఉద్భవించాడని పురాణకథనం. జేజేబువ్వ అంటే చంద్రుడు. క్రొవ్వెద అంటే కొప్పు. కొప్పున చంద్రుడు గలవాడు శివుడు. అందువల్ల ఆ శివుడనే అయ్యగారికి బ్రహ్మ నుదురు అవ్వగారు. ఆ బ్రహ్మ జన్మస్థలం విష్ణు నాభి.

అలాంటి విష్ణుమూర్తి భక్తుల సేవలు అందుకునే ఉద్దేశంతో అర్చావతార మూర్తిగా వేంకటాచలంలో వెలసిన దేవదేవునికి నా కావ్యకన్యకతో కళ్యాణమొనరిస్తున్నాను అన్నారు కవి.

అర్చావతార (మూర్త్యర్చన) పూజ వేద ప్రామాణికం. దైవం ఆశిస్తున్న సేవను తన ప్రబంధం ద్వారా చేస్తున్నారు కవి. కావ్యకన్యక అక్షరస్వరూపం. విష్ణువు ప్రణవ స్వరూపం. అక్షరం, నాదం కలిస్తే శబ్దం. అదే వాఙ్మయ రూపం. అంతే కాక తన బిడ్డతో కళ్యాణానికి వరుడు దేవదేవుడు కాబట్టి అతనికి మూర్తిమత్వం కల్పిస్తున్నాడు కవి. అందుకే అర్చావతార పద ప్రయోగం.

- చేపూరి శ్రీరాం హన్మకొండ

ప్రహేళిక

ప్రాచీన కవులు రాజులను లేదా గొప్ప వారిని ఆశీర్వదించినపుడు చమత్కారం గానో లేదా అలంకారగర్భితంగానో, గూఢార్థముతోనో ద్వంద్వార్థము గల శ్లోకాలను ఆశువుగా చెప్పేవారు. అలాంటిదే ఈ శ్లోకం.

అనేకానన సంఛేత్తీ హరినందనసూదనః ।
ధరాత్మజాపతిః పాయాత్ రాజచూడామణిస్సవః ॥

దీంట్లో రామచంద్రస్వామి–శివునిపక్షం రెండువైపులా ఉంటుంది.

రామునిపక్షం: అనేకానన సంఛేత్తి = అనేక ముఖములు గల రావణాసురుని సంహరించిన వాడు; హరినందనసూదనః = సూర్యుని కుమారుడు వాలిని సంహరించినవాడు; ధరాత్మజాపతిః = సీతాదేవి భర్త; రాజచూడామణిః = రాజులలో చూడామణి లాంటివాడైన రామచంద్రస్వామి; వః = మిమ్ములను; పాయాత్ = రక్షించుగాక.

శివుని విషయంలో: అనేకానన సంఛేత్తి = నాలుగు ముఖములు గల బ్రహ్మ ముఖాన్ని తీసివేసినవాడు; హరినందనసూదనః = విష్ణుమూర్తి కుమారుడైన మన్మథుని సంహరించినవాడు; ధరాత్మజాపతిః = హిమవంతుని పుత్రిక అయిన పార్వతీపతి; రాజచూడామణిః = రాజు అనగా చంద్రుని చూడామణిగా శిరోభూషణముగా ధరించిన పరమేశ్వరుడు; వః = మిమ్ములను; పాయాత్ = రక్షించుగాక.

ఈ విధంగా ఒకే శ్లోకంలో రెండర్థములు, మూడర్థములు రచించిన మహాకవులు మన సాహిత్యచరిత్రలో చాలామంది ఉన్నారు. అలాంటివి తెలుసుకుంటే మనకు కొత్త శబ్దాలు అర్థాలు పరిచయమౌతాయి. సంస్కృత విజ్ఞానం తెలుస్తుంది. స్వస్తి.

- ముత్యంపేట గౌరీశంకర శర్మ

కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

కష్టం: రెండవ పదదోషం – వామనుని అభిప్రాయం మేరకు – కష్టం. **'శ్రుతివిరసం కష్టమ్'** అని కష్టలక్షణం. వినటానికి కంటకంగా ఉండేది అంటే కటువుగా వినిపించేది కష్టం.

అచూచురచ్చణ్డి కపోలయోస్తే ।

కాంతిద్రవం ద్రాగ్ విశదః శశాంకః ॥ ఇది వామనుడు ఇచ్చిన ఉదాహరణం. కాంతి ద్రవం ప్రక్కన విశదః పదానికి ముందు ద్రాక్(గ్) పదం చెవికి కంటకింపుగా ఉంటుంది.

భామహుడు దీనిని శ్రుతి కష్టమని నిర్దేశించాడు. అజిహ్లదత్ వంటి పదాల ప్రయోగం వ్యాకరణశుద్ధమైనప్పటికీ చెవికింపు కాదని భామహ భావం. అయితే భామహుడు సన్నివేశవిశేషం వలన దోషం కూడా దోషం కాకుండా పోతుంది అని – **సంనివేశ విశేషాత్తు దురుక్త మపి శోభతే** అని మినహాయింపు ఇచ్చాడు. కానీ వామనుడు ఆపాటి కూడా అంగీకరించ లేదు. చెవికింపు కాకపోవటం ఎప్పుడైనా దోషమే అని భావించాడు. మమ్మటుడు కావ్యప్రకాశంలో **'శ్రుతికటు'** అని ఈ దోషాన్ని నిర్దేశించాడు.



ఉదా: అనంగమంగల గృహాపాంగ భంగి తరంగితైః ।
ఆలింగితః స తన్వంగ్యా కార్తార్థ్యం లభతే కదా ॥

ఇక్కడ **కార్తార్థ్యం** తద్ధితాంతపదం వినసొంపుగా ఉండకపోగా కటువుగా వుంటుంది కూడా. యమకాద్యలంకాలలో గానీ రౌద్రరసంలో గానీ, ఆయా పాత్రలను బట్టి గానీ ఈ శ్రుతి కటుదోషం దోషత్వాన్ని కోల్పోతుంది.

ఇక తెలుగులోనికి వద్దాం. కావ్యాలంకారసూత్రవృత్తిని అనువదించిన శ్రీ వేదాలవారు చండకౌశికం(నాటకం) నుండీ **"జిగికనీనిక గ్రాలు దృగంచలంబుతో సొగసుగ నాపయిం బొలియు చూపు"** – ఇక్కడ **'గ్రాలు దృగంచలంబు'** వినుటకు కంటకింపుగా ఉంది. కాబట్టి శ్రుతి కటువు.

శశాంకవిజయం నుండీ –

వహ్న్యర్కి నైరృతి వరుణ వాయుకుబేర
శంకరుల్ గదిసి పార్శ్వముల గొలువ – 4/142

సంస్కృతంలో తద్ధితాంత రూపాలూ, సన్నంత రూపాలూ, నామధాతురూపాలు, యఙన్త యఙ్లు గన్త రూపాలు వాడబడితే ఈ శ్రుతి కటుత్వం సుస్పష్టంగా ఉంటుంది. వాటిలో తెలుగులోనికి రాదగిన వాటిని తెలుగులోనికి తేగల పాండిత్యం వర్తమాన కవులలో చాలా మందికి లేదు. అంత సంస్కృత పాండిత్యం గలవారు తెలుగు పద్యాలు వ్రాయటం లేదు. తెలుగులో పద్యాలు వ్రాస్తున్న వారిలో అంత సంస్కృత పాండిత్యం లేదు. ఈ రెండు వాక్యాలకూ మినహాయింపుగా కొందరు లేకపోలేదు. కానీ చాలా స్వల్ప సంఖ్య.

నాకు తెలిసినంతలో శ్రీ పాలడుగు శ్రీచరణ్‌గారు ఆ రెండింటినీ కలిపే ప్రయత్నం చేస్తున్నారు. శ్రుతి విరసత్వం లేకుండా పద్యం నడిపించే శ్రద్ధను కూడా వారు తీసికుంటారు. సంస్కృత పదాలనూ, సమాసాలనూ విరివిగా... కొండొకచో అర్థం లేకుండా నిరర్థకంగా వాడుతూ అదే పాండిత్యమని భ్రమపడుతున్న బహుబృందరచయితలూ మనకు లేకపోలేదు. పదాడంబరానికీ, పదప్రౌఢిమకూ అర్థం కానీ, భేదం కానీ తెలియని వారి వల్ల భాషకు నష్టియే గానీ పుష్టి లేదు. వర్ధమాన రచయితలు ఆ బాటను తప్పించుకొని వీలైనంతవరకూ నడవటం మంచిది. దీర్ఘ సమాసరచనం 'మహా'గొప్పగా అప్పటికనిపిస్తుంది. కానీ అది భావాన్ని మింగేస్తుంది. భావనాబలం లేనప్పుడు ఆ శైలిని స్వీకరిస్తే లోపాలను కప్పిపుచ్చుకోవచ్చు.

తెలుగులో పద్యాలు వ్రాసేటప్పుడు మత్తేభ శార్దూలాలలో యతిమైత్రి దగ్గర ఈ శ్రుతి కటుత్వం చాలా తావుల్లో కనిపిస్తుంది. అది వ్యాకరణ విరుద్ధం కాదు కాబట్టి రచయితలు కూడా దానిపై అంతగా శ్రద్ధ పెట్టరు.

మత్తేభ శార్దూలాలలో యతిమైత్రి స్థానానికి పూర్వవర్ణం గురువు కావలసి వస్తుంది. ఆ వర్ణం నైసర్గికంగా అంటే దీర్ఘమో, పూర్ణ బింద్వనుగతమో అయితే ఆ వినికిడి ఒక రకంగా ఉంటుంది. కానీ యతిమైత్రీస్థానం సంయుక్తాక్షరమై, పూర్వాక్షరం హ్రస్వమై పరాక్షరం వలన గురువు కావలసి వచ్చినప్పుడు ఆ వినికిడి వేరుగా వుంటుంది. ఇక్కడే చాలాసార్లు వినసొంపుగా అనిపించదు. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

ఇవియేనున్ సతతంబు నామది కరం బిష్టంబులై యుండుఁ బా
యవు భూదేవకులాభితర్పణమహీయః ప్రీతియున్ భారత
శ్రవణాసక్తియుఁ బార్వతీపతి పదాబ్జ ధ్యాన పూజా మహో
త్సవమున సంతతదానశీలతయు శశ్వత్సాధు సాంగత్యమున్

(మహాభారతం – ఆది 1/12)

ఈ పద్యంలో 1,2,4 పాదాలలో యతి పూర్వవర్ణానికి ఉత్తరవర్ణ ప్రసక్తి అవసరం లేదు. 3వ పాదంలో మాత్రం ఆ సంయోగాక్షర అవసరముంది. తేడా గమనించవచ్చు వినికిడిలో – మరో పద్యం.

శ్రీ వక్షోజకురంగ నాభ మెదపైఁ జెన్నొంద విశ్వంభరా
దేవిందత్కమలా సమీపమునఁ బ్రీతిన్నిల్పినాడోయనం

గా వందారు సనందనాది నిజభక్తశ్రేణికిం దోచు రా
జీవాక్షుండు కృతార్థుఁ జేయు శుభదృష్టిం గృష్ణరాయాధిపున్

ఇక్కడ మొదటి రెండు పాదాలలో ఆ వర్ణం నైసర్గిక గురువు. మూడు నాలుగు పాదాలలో పరవర్ణ సంయోగం అపేక్షిస్తుంది. వీటి వినికిడిలో గల భేదాన్ని గమనించండి. మరో పద్యం –

శ్రీ మంజూషిక భక్తరక్షణకళాశ్రీచుంచు వానంద వ
ల్లీ మంజు ప్రసవంబుఁ జిద్గగన ప్రాలేయాంశువున్ మోక్షల
క్ష్మీమాణిక్యవినూత్నమేఖల కటాక్షీభూత నీహారరుక్
శ్రీమంతంబయి పొల్చు వెల్గునొకఁడే సేవింతు వేశ్వేశ్వరా!

(రామాయణ కల్పవృక్షం–బాల–1)

ఈ పద్యంలో రెండవ పాదంలోని 'గగన ప్రాలేయాంశు' ప్రయోగం శ్రుతి కటువుగా వినిపిస్తుంది. ఇక్కడ 'ప్రా'కు ముందున్న 'న' గురువా? లఘువా? అని వాదోపవాదాలు చాలా చేశారు. ఇప్పటికీ ఏదో ఒక చోట ఆ చర్చ చేస్తూనే వుంటారు నిష్ప్రయోజనంగా, నీరసాతినీరసంగా. ప్రస్తుతం మన చర్చ అది కాదు. అది శ్రుతి కటువా? కాదా? అని. కవి దానిని(న కారాన్ని) లఘువుగా నిర్దేశించారు. పద ప్రారంభంలో 'ప్ర' కు ముందున్న 'జు'ను గురువు చేసి, ఇక్కడ 'ప్రా'కు ముందున్న 'న'ను లఘువు చేశాడు. నిరంకుశత్వమంటే సరిగ్గా ఇదే. దాన్ని మనం చదవాలి. 'గగన ప్రాలేయా' అంటూ 'న'ను తేల్చి పలకాలి. అది సాధ్యమేనా? శాస్త్రం లొంగినంత తేలిగ్గా శరీరం లొంగదు గదా? 'న' దగ్గర ఆపకుండా, లఘువుగా ఉచ్చరిస్తూ ఆ సమాసాన్ని చదవాలి. కొంచెం కష్టమే. ఇప్పుడు చెప్తున్న అంశం అదే గదా! వీరభక్తితో ఇదంతా సాధ్యమేనని ఎవరైనా వాదించవచ్చు. వారికి ముందే నమస్కారం. అసమర్థవాదాలకు దిగితే సాధించగలిగేది ఆ మహనీయుల పరువును బజారు కీడ్చడమే.

మరొక ఉదాహరణం డా॥ కోడూరి విష్ణునందన్ ధర్మ దండం నుండీ –

చలత్ సటాభటా ప్రభావసంభ్రమత్ సమీరుఁడై
జ్వలన్మహోగ్రనేత్రగోళసంభృతాగ్ని హోత్రుఁడై
విలక్షణాభియాన మాత్రప్రేంఖిత క్షితీద్యుఁడై
చెలంగి నా నృసింహమూర్తి జృంభిత ప్రతాపుఁడై

(ధర్మదండము – 633)

ఇక్కడ కూడా మూడవ పాదంలో 'మాత్రప్రేంఖితక్షితీద్య' వినటానికి అనువుగా వుండదు. ప్రేంఖిత ముందున్న 'త్ర'ను లఘువుగానే స్వీకరించాడు కవి.

సంస్కృతంలో ఒక ప్రసిద్ధ శ్లోకముంది.

తరుణం సర్షపశాకం నవౌదనం పిచ్ఛిలాని చ దధీని ।
అల్పవ్యయేన సుందరి! గ్రామ్యజనోమృష్టమశ్నాతి ॥

ఇది పథ్యార్యాచ్ఛందస్సు. పూర్వోత్తరార్ధాలలో మూడు గణాలకు పదం విరిగిపోవడం పథ్యార్యాలక్షణం. ద్వితీయార్ధంలోని సుందరి (చతుర్మాత్రాగణం 'రి' లఘువైతే)లో 'రి' గురువవుతుంది. తర్వాత 'గ్రా' – సంయుక్తాక్షర ముంది కాబట్టి. కానీ అది గురువైతే గణభంగం. కాబట్టి రేఫ సంయోగానికి ముందున్న 'రి' ని లఘువు గానే స్వీకరించారు. దానికి వృత్త రత్నాకర మిచ్చిన నియమమిది. పాదాదిలో సంయుక్తాక్షరముంటే దాన్ని 'క్రమం' అంటాం. దానికి ముందున్న గురువు కొన్ని చోట్ల లఘువు అవుతుంది.

శ్లో: పాదాదావిహ వర్ణస్య సంయోగః క్రమ సంజ్ఞితః ।
పురఃస్థితేన తేన స్యాల్లఘుతాపి క్వచిద్గురోః ॥

(వృత్తరత్నాకరం – 1/10)

అదీ నియమం. కాబట్టి పాదాదిలో సంయుక్తాక్షరముంటే – క్రమముంటే – దానికి ముందున్న పూర్వపదాంత మందున్న గురువు కావలసిన వర్ణం లఘువైనా అవుతుంది అని. సంస్కృతం లోని పాదనియమాలు, ఆయా పాదాలలో గణనివేశన నియమాలు వేరు వేరు. పూర్వోత్తరార్ధాలను కలుపరు అసలు సంస్కృతంలో. ప్రథమ ద్వితీయ పాదాలను పదైకదేశంతో కలపరు. తెలుగులో అటువంటి నియమాలు లేవు.

ఆ క్రమాన్ని అవకాశంగా తీసికొని సంస్కృతం వాళ్లే సంయుక్తాక్షరాలకు(రేఫ సంయోగానికి ముందు) గురువును లఘువును చేయడం ఎక్కడో గానీ వాడలేదు. దాన్ని అడ్డం పెట్టుకొని మనం – తెలుగువాళ్ళం– క్రమం లేదూ, పాదూ లేదూ. ఎక్కడ బడితే అక్కడ రేఫ సంయోగానికి ముందు లఘువు చేసేస్తున్నాం. పలకటం కుదురుతుందా లేదా అన్న ఆలోచన కూడా మనకు లేదు. సంస్కృతం వాళ్ళు ఇప్పటికీ ఛందోవ్యాకరణ నియమాలను ఉల్లంఘంచటానికి భయపడతారు. తెలుగువారు వీరులు. భయానికి అతీతులు.

రానిక నీకోసం సఖి / రాదిక వసంతమాసం...
వాకిటిలో నిలబడకు ఇక / నాకై మరిమరి చూడకు
ప్రతిగాలిసడుల తడబడకు / పదధ్వనులనీ భ్రమపడకు –

ఇదొక చలనచిత్ర గీతం. ఆ విప్రలంభ శృంగారంలో 'పద ధ్వని' అని 'ధ్వ'ను ప్రయోగించటం కర్ణకఠోరం.

తెలుగు పదాలలో కూడా ఇటువంటి వర్ణవిన్యాం చూపించ వచ్చు. అయితే ఆయా వర్ణాలను బట్టి అది కంటకింపుగా కాక వినసొంపుగా ఉంటుంది. ఉదా –

ధరణిన్ దేవుని సృష్టి కార్యమున భేదంబుండదంచందురే
భరతోర్విన్ కులభేద మెంచుచు జనావాసంబులన్ వారలన్
సరిగాఁ జూడక సాటిమానవులలో సామాజికంబైన యం
తరువుల్ పెంచుట తప్పు! పట్టుదలతో ధ్వంసంబు గావింపుమా!

(శంకరాభరణం 14–11–25)

"భేదంబుండదంచందురే" – ఇక్కడ సరళమైన దకారం భ కార దకారాల మధ్య ఉండటంతో ఇది అందగించింది. మరో వర్ణమైతే కష్టంగానే వుండేది.

లేఖ

గౌ॥ సంపాదకులకు..

'అవధానపుష్కరిణి' అక్టోబరు సంచిక – 'కావ్యశాస్త్ర గవేషణ' శీర్షికతో ప్రచురింపబడిన వ్యాసములో కావ్యదోషాలకు ఉదాహరణలుగా ప్రస్తావింపబడిన నేను రచించిన పద్యములకు సంబంధించిన వివరణ:

నాచే పలుకులతల్లిపలికించినపద్యములందలి వాక్యములకు నేను భావించినతీరు..

రసవిహారమైన రామాయణమునందు
చవులుగొన్న మనసు దవులుకొన్న
జన్మమునకు వేఱె చరితార్థ్యమేముండు..

ఇక్కడ నా భావించినది.. చరిత – జీవనవిధానము, నడవడిక; అర్థము – అర్థ్యము – కోరదగినది..

అర్థ్యము సం. విణ. (అ. అ. అ.) 1. వేఁడఁదగినది.

2. అర్థమునుండి తొలఁగనిది.

(క) ప్రయోజనముతోఁ గూడినది. (చ) సార్థకమైనది, అర్థయుక్తమైనది.(శబ్దాది) (ట) ధనము గలది. (త) న్యాయముతోఁ గూడినది. (ప) పాండిత్యము గలది, జ్ఞానము గలది.

(సూర్యరాయాంధ్రనిఘంటువు)

భావము.. పరబ్రహ్మానంద (రసో వై సః) రసవిహారమైన రామాయణము – శ్రీరాముని చరితము (చరితం రఘునాథస్య.. శతకోటిప్రవిస్తరమ్..) నందు లగ్నమైన మనసుకలవానికి, జన్మకు సార్థకముగ చరిత+అర్థ్యము–చరితార్థ్యము– జీవనవిధానమున వేడదగినది ఏముంటుంది.. రఘుకులతిలకుని చరితమే కదా..

రాకాశీతాంశురుచిప్రసన్నవిలసత్ క్రమస్మితోల్లాస

రాకాశీతాంశురుచి –ప్రసన్న–విలసత్–క్రమ– స్మితమునకు విశేషణార్థములో.. పూర్ణచంద్రుని కాంతి వల ప్రసన్నమై ఆహ్లాదకరమై ప్రకాశించు సుందరమందహాసోల్లాస!

సరిదుదృఘనదేహదీధితులు విశ్వశ్రేయకారుణ్యముల్

శ్రేయస్ శబ్దమును అకారాంతముగ ప్రయోగించుటదోషము..

ఒకధారగా వెలువడిన పద్యపునర్వీక్షణలో అది గమనించి అప్పుడే "విశ్వక్షేమకల్యాణముల్" అని సవరించడమైనది.. దానితో పాటే.. "శశ్వత్కాంతికారుణ్యముల్" అని పాఠాంతరమూ సూచించడమైనది.. కానీ సవరింపని పాదముతోనే సమూహములలో పద్యము సమర్పింపబడినది.. ఇది ప్రమాదము..

హారస్ఫారపటీరహీరధవళాహారాయితాకార

ధవళా – ఆకారాన్త స్త్రీలింగము..

వర్ణాదిభేదాత్ సంజ్ఞాస్యుః శబలీ ధవళాదయః అని అమరము..

గో విశేషము..తెల్లని గోవు.. శబ్దకల్పద్రుమము..

పవిత్రమైన 'గో'–అర్థమున ధవళా .. గో అనగా వాక్కు.. అనికూడ..

వాక్స్వరూపమైన – హారాయితాకార అని ధ్వని..

अमरकोशः

धवला (स्त्रीलिङ्गः) » गोभेदः

मूलम् — अर्जुन्यघ्न्या रोहिणी स्यादुत्तमा गोषु नैचिकी ।
वर्णादिभेदात्संज्ञाः स्युः शबलीधवलादयः ॥ (२.९.६८)

समानार्थकाः — शबली धवला

शब्दकल्पद्रुमः

धवला » धवला . स्त्री. (धावतीति । धाव + कलः ह्रस्वश्च । अनुदात्तत्वाभावात् न ङीष् ।) शुक्ला गौः । इत्यमरः । २ । ९ । ६७ ॥

స్వర్గేషు పశు వా గ్వజ్ర దిఙ్నేత్ర ఘృణి భూ జలే,
లక్ష్యదృష్ట్యా స్త్రియాం పుంసి గౌః-

గోశబ్దము స్వర్గమునకు, బాణమునకు, పశువునకు, వాక్కునకును, వజ్రాయుధమునకును, దిక్కునకును, నేత్రమునకును, కిరణమునకును, భూమికిని, నీళ్లకును పేరు. ఈగోశబ్దము లక్ష్యదృష్ట్యా = ప్రయోగానుసారమున, స్త్రియాం =

వాగ్దేవికి విశేషణములుగ తెల్లని వస్తువులన్నింటి కూర్పు.. ప్రసిద్ధము..

యాకున్దేన్దుతుషారహారధవళా.. (ప్రసిద్ధమైన సరస్వతీ ప్రార్థన)
శారదనీరదేందుఘనసారపటీరమరాళమల్లికాహార..
(పోతనమహర్షి)

మరొక అర్థవిశేషము.. నీహారస్ఫారపటీరహీరధవళా+ఆ+హారాయితాకార – 'ఆ' కారమునకు స్థానము, ఉనికి, అన్న

ఆకారస్తు పదే భావే పరి
తాపే పితామహే,

ఆ॥పు॥ ఇది, స్థానమునకును, సత్తకును, పరితాపమునకును, బ్రహ్మదేవునకును పేరు.

అర్థములు కూడ ఉన్నవి..

(నానార్థనిఘంటువు–ఇరుగపదండనాథుడు)

కాబట్టి నీహారస్ఫారపటీరహీరధావళ్యములకు స్థానమైన హారాయితాకార..

మునిజనసహృదయకమలవికసనధామ

(రామేశ్వరక్షేత్రదర్శనమున శ్రీరామచంద్రుల స్తుతి)

ఇక్కడ నా భావించినది..

మునిజనము – శమదమనియమాదులచే సాధనచేయు తాపసజనము; సహృదయుజనము –చిత్తశుద్ధికలవారు..

తపస్సులైన మునిజనము, చిత్తశుద్ధికల సహృదయులు–సామాన్యజనము అనెడు కమలములకు వికసనము ప్రకాశము–వెలుగు – జ్ఞానము నొసగెడువాడు..

వెలుగు మరొక్కపేరఖిలవిద్యలకున్ – అని కవిసమ్రాట్ విశ్వనాథసత్యనారాయణగారు, కల్పవృక్షము సుందరకాండమున..

సరస్వత్యాస్తత్త్వం కవిసహృదయాఖ్యం విజయతే

(అభినవగుప్తపాదులు)

– సాంప్రతి సురేంద్రనాథ్

అవధాన సౌరభమ్ - 3

-సాంప్రతి సురేంద్రనాథ్

ఇంత చెప్పుటఏల ..యనగా ఆ అసాధారణవిదుషీమణి “మేధాం వ్యనక్తి వివిధావధానే” అని పేరెన్నికగన్న ప్రతిభావంతురాలు.. వివిధావధానములలో ఆమె ప్రదర్శించిన సాహితీవిన్యాసములు ఏ విద్వత్కవికూడ ప్రదర్శించనివి..

ఆరు భాషలలో ఏక కాలములో సమస్యాపూరణము.. నిషేధాక్షరి, వ్యస్తాక్షరి, వర్ణనములు నిర్వహించినదని ప్రతీతి.. అందరూ ఘటికాశతగ్రంథ సామర్థ్యము కలవారైతే మధురవాణి అరఘడియలో ఆరుభాషలలో శతకమును ఆశువుగా రచించగల మేధావిని.. విద్వద్గోష్ఠీవాదములలో దిగ్విజయము చేసి మధుర నుండి “సరస్వతీమహల్” సాహిత్యక్షేత్రాన్ని తంజాపురమునకు తరలించిన అనన్యసామాన్యప్రజ్ఞాధురీణ..

అట్లే ఆ మహాసరస్వతీమూర్తికి సమానమైన ప్రతిభా పాండిత్యాలతో విరాజిల్లిన మరొక కవయిత్రి రామభద్రాంబ “అష్టభాషాకల్పిత చతుర్విధకవితాధురీణ”

విజయరాఘవనాయకుని ఆస్థానకవయిత్రి..పసుపులేటి రంగాజమ్మ “అతులితాష్టభాషాకవితా సర్వంకషమనీషావిశేష శారద” ఇక .. ప్రతాపసింహుల ఆస్థాన విదుషీమణి ముద్దుపలుకుల ముద్దుపళని రచించిన శృంగారభరితకావ్యము “రాధికా సాంత్వనము”లో “ఘటియింపనేర్తువు కవనజాతు లెఱింగి పలుకుల కల్కి వెల్వెలనc బాఱ” అని తననుగురించి చెప్పుకొన్నది. శహాజీరాజు కాలమున “అష్టావధాని” అన్న కవి.. అతని అసలు పేరు తెలియదు.. “చంద్రశేఖరవిలాసము” నాటకమును సంస్కృత,ప్రాకృత, ఆంధ్ర, మహారాష్ట్రాది ఎనిమిదిభాషలలో వ్రాయుటచే అష్టభాషాపండితుడని, అందుచేతనే అతని బిరుదనామము “అష్టావధాని” అయినదని ..సాహిత్యమర్మజ్ఞులు నిర్ణయము..

ఇంతకు..తెలుగుభాషకింత విశేషప్రతిపత్తిని చేకూర్చిన అవధానకళ ఆంధ్రులకే ప్రత్యేకమైన సాహిత్యప్రక్రియ..

అయితే..తెలుగులో ఆదికవి కాలం నుంచీ ఇంతమంది అవధాని శబ్దవిరాజితులై ఉంటే మరి..తిరుపతివేంకటకవులకే అత్యద్భుతంబైన అవధానవిద్యకు ప్రభవకారణమైన ప్రతిభ కలవారిగా కీర్తించడమెందుకు...? అంతేకాక.. ప్రాచీన మహాకవు లనేకులు తెలుగుకవులకు కవిత్వప్రచోదన కలిగించిన వారుంటే.. “అత్యద్భుతంబైన అవధానవిద్యకు ప్రభవకారణమైన ప్రతిభవారు” అని “జగదాశ్చర్యకరావధానకవితాసంపత్తి” కలవారని “అద్యత నాంధ్రకవి ప్రపంచ నిర్మాత” లని తిరుపతి వేంకటకవులకే కీర్తి యేల..?

(సశేషం)

పద్యపరిమళం

అమ్మ

“అఖిలాండ జనని నిత్యార్చన లేనట్టి
కొంప గా దది, కోళ్ళగంప గాని;
త్రిపుర సుందరి తృప్తి దీర్చని యన్నిచు
సిరులు గా వవి, కొండచరులు గాని;
ఆదిశక్తిని గూర్చి అర్చ సల్పనివాని
కేలు గా దది, బండికీలు గాని;
అంబిక నెప్పుడు నభినుతింపని వాని
నోరు గా దది, కట్టె వేరు గాని;
భగవతి కొసంగలేని దుర్భగుడు గూర్చు
ధనము గాదది, నరక సాధనము గాని;
ధారుణీశ్వర! తెలియంగలేరు జనులు;
తల్లి జగదంబ నత కల్పవల్లి సుమ్ము.”

(ములుగు పాపయారాధ్యుల వారి “దేవీ భాగవతం” నుండి)

దేవీనవరాత్ర పూజావిధానం వివరించే సందర్భంలో జనమేజయ మహారాజునకు వ్యాసులవారి నోట కవి పలికించిన మాట ఇది.

“ఓ మహారాజా! భువనైకమాత అమ్మ. భక్తుల పాలిట కల్పలత. ఈ సత్యాన్ని లోకులు గుర్తించ లేకపోతున్నారు. విశ్వజననికి నిత్యమూ అర్చన చేయని ఇల్లు కోళ్ళగంప. త్రిపుర సుందరిని తృప్తిగా సేవించుకోలేని వాని సంపద కొండ చరియలతో సమానం. ఆదిశక్తిని పూజించని వాడి చేయి బండికీలు. అమ్మను నోరార కీర్తించలేని నోరు కట్టె వేరుమాత్రమే. భగవతికి సమర్పించలేని ధనం నరక సాధనమే.”

మానవుడి సంపదలన్నీ అమ్మ అనుగ్రహంవల్ల లభించినవే. ఆ సంపదలను మళ్ళీ దైవ సేవలో వినియోగించినప్పుడే ఆ సంపదలకు సార్థకత.

అసలు ఈ జన్మే ఆ తల్లి ప్రసాదం. తన నివాసం, తన పది ఇంద్రియాలు, తన మనో వాక్కాయ కర్మలూ అన్నీ దైవారాధనలో సమర్పించలేకపోతే అవి చైతన్యం కోల్పోయి, ఎందుకూ కొరగానివే అవుతాయి.

పోతన్న కవితాశైలిని తలపింప చేసే పద్య మిది. ఇలాంటి పద్యాలు ఈ కావ్యంలో ఎన్నో. దేవీ భాగవత రచన కోసం పోతన్నే పాపయారాధ్యుల రూపంలో మళ్ళీ పుట్టాడని కొందరి విశ్వాసం.

- ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

ఈనెల అంశం: మహిత మార్గశీర్షం

ఖండశర్కర

నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్
అష్టావధాని చేపూరి శ్రీరామ్

డా.రఘుపతి శాస్త్రుల, నిజాంపేట్, హైదరాబాద్

ఉ. మాసములందు మార్గ శిర మాసమె శ్రేష్ఠ మటంచు చెప్పె వి
శ్వాసము గూర్చు నట్లు భగవానుడు కృష్ణుడు వర్షమందు నీ
మాసపు ధ్యాన సంపదలు మానిత సత్ఫలితార్థ సిద్ధితో
భాసిత రీతులన్ సుగతి వర్ధిల గూర్చుచు నుండు నెప్పుడున్

ఉ. స్కందుడు షష్ట మాతృకల సంపదగా జననమ్మునందె యీ
సుందరమైన షష్టిని, సుశోభిత రీతుల నొప్పు పూజలా
నందము తోడ గైకొను సనాతన దైవము, భక్తి చిత్తమం
దొంద, ననుగ్రహమ్మును యథోచితరీతుల గూర్చు నీశుడున్

శా. గీతాచార్యుని కృష్ణునిన్ జగతి సంక్షేమ ప్రదానార్థమౌ
గీతార్థమ్ము స్మరించినన్ సుమతితో కీర్తింప ప్రద్యుమ్నుడున్
చేతోమోదమునందు మాసమిదియే శీఘ్రమ్ముగా స్తోత్రముల్
ప్రీతిన్ గాంచుచు సద్గతుల్ గనగ సంవేద్యుండు గూర్చున్ సదా

శా. దత్తాత్రేయుడు దివ్యరూపుడు భువిన్ తత్త్వార్థ త్రైలోక్య సం
పత్తిన్ గాంచిన మాసమిద్ది తలపన్ వైవిధ్యమౌ రీతులన్
దత్తోపాసన జేయగల్గినను ప్రత్యక్ష స్తుతిన్ పూర్ణిమన్
బత్తిన్ సాధన జేయువారలిలలో వర్ధిల్లగన్ సాధ్యమౌ

మ. సమశీతోష్ణపు శోభలం గనుచు ప్రాశస్త్యమ్ముగా పృథ్వియున్
తమికాన్పించుచు వేడ్క చేయు నెదకున్ తాల్మింగనన్ కర్షకుల్
తమదౌ త్యాగము వర్ధిలన్ కృషిని సంధానింప నీ నేలయున్
రమణీయమ్మగు సంపదన్ హరిత సామ్రాజ్యంపు సొంపొప్పెడిన్

ధనికొండ రవి ప్రసాద్, హైదరాబాద్

తే.గీ ఉరుము, పిడుగుల వర్షమ్ము లుర్వి కిచ్చు
జలద పంక్తుల సమరమ్ము సన్నగిల్లి,
భాను కిరణ యుద్ధము చప్ప బడగ సంధి
మార్గమున్ జూపె చల్లని మార్గశిరము.

మ. హిమశైలమ్మును గాంచ లేక యట సర్వేశున్ గనన్ గష్టమై,
యమృతోపమ్మగు మౌని వాక్యముల తత్త్వార్థమ్ములన్ గ్రోలగా
నమితావేదన జెందు మానవుల కై యా శంభుడే శాంతుడై
హిమవాతావరణమ్ము బంపెనొ యనన్ హేమంతమే వచ్చెగా!

ఆ.వె. హిమపు జల్లు నిండు నీ తరువున్ జూడ
నెంతొ ప్రేమ తోడ సంతసమున
భర్త యొసగినట్టి పలు ముత్యముల రాశి
దాల్చి మురియు నట్టి తరుణి తోచు.

తే.గీ. వల్లినిన్ దేవసేనను పత్నులుగను
బొంది నట్టి సుబ్రహ్మణ్యు పూజ జేయ
సంతు బడయగ, తాత్త్విక శాంతి నొంద
మార్గశిరషష్టి దివ్యమౌ మార్గ మిచ్చు

ఆ.వె. ఏది యైన సుంత హెచ్చుగా సహియించ
లేని వాడు కాదె మానవుడన!
శాంతి హెచ్చు నైన చల్లదనము హెచ్చు
నైన సుంత బాధ యతని కుండు .

డా.ఎన్.వి.ఎన్.చారి, హనుమకొండ

శా. గీతాచార్యుని దివ్యబోధ నిలిపెన్ క్రీడిన్ కురుక్షేత్రమున్
చైతన్యంబునునింపెనీ నరుని విశ్వాసంపు మూలంబునై
యాతండే గద మార్గశీర్షమును నేనంచున్ ప్రబోధించి ప్ర
ఖ్యాతారాధ్యవిశిష్ట రూపమిడె సద్యానంబుజేయన్ జనుల్

ఉ. సాధనజేయువారలకు సత్యము జూపును మార్గశీర్షమే
శోధన జేసి శ్రీహరిని శుద్ధ మనంబున జేరవచ్చు, ది
వ్యాతత విష్ణుతత్త్వ మహిమా వృత మర్మములన్ని గాంచు,సం
కేతము నిచ్చి బ్రోచు శుభ కేతన మిద్దియె వర్షమందునన్

శా. శ్రీరంగంబుననుద్భవించి సిరియై శ్రీకృష్ణునిన్ భర్తగా
నారాధించెను శ్రీవ్రతంబనెడు స్వాధ్యాయానుసంధానమున్
క్షీరాబ్ధిన్ శయనించుస్వామి గలియన్ చేసెన్ మహాపాశురాల్
చేరెన్గోదయెరంగనిన్ వ్రతమునన్ సిద్ధిన్ వివాహంబుతో

మ. స్థిరమౌ బుద్ధిని ధ్యానమున్ గరపుచున్ దివ్యాత్మలీ మార్గళిన్
వరలక్ష్మీపతి సంప్రసాద ఫలితంబాసాంతమున్ పొందుటన్
పరతత్త్వంబునుజూపుమార్గమిదియేపల్లాండు పల్లాండనన్
హరికిన్ మేల్కొలుపయ్యె నీ నెలయె నిత్యాలంకృతాకర్షణన్

తదుపరి అంశం

మురిపాల ముద్దబంతి

పై అంశానికి 5పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 డిసెంబరు 2025

కన్నడ శతావధాని జీ'రా'గణేష్!

అష్టావధాని డా॥ రేవూరు అనంత పద్మనాభరావు

అవధానం ఆంధ్రుల సొత్తు అనేది నానుడి. కానీ కన్నడంలోను ప్రచారంలోకి వచ్చిన అవధాన ప్రక్రియా దురంధరుడు డా.గణేష్.. ఈయన వృత్తిరీత్యా ఇంజనీరింగ్ కళాశాలలో కొంత కాలం ఉద్యోగం చేసి విరమించుకొన్నారు. ఆయన బహుభాషావధాని. సంస్కృతం, కన్నడం, ప్రాకృతం, తెలుగు, ఆంగ్లం, హిందీ, తమిళాది భాషలతో కూడిన అంశాలతో అవలీలగా అవధాన ప్రదర్శన అచ్చారు. 1200 అవధానాలు చేసి రికార్డు సృష్టించారు.


అష్టావధానంతో బాటు అనేక శతావధానాలు చేశారు. నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, వర్ణానాంశాలకు తోడు చిత్ర కవిత్వంలో భాగమైన బంధకవిత్వం కూడా ఒక అంశంగా ఎంచుకోవడం ప్రత్యేకత. కాగితం, కలం పట్టుకొని బొమ్మలు గీచుకొని గంటలపాటు కుస్తీ పడితే గాని సాధ్యం గాని బంధ కవిత్వాన్ని అలవోకగా అవధానంలో భాగంగా చెప్పగలగడం సర్కసులో పులినోట్లో తల దూర్చడం వంటి విద్య.

గణేష్ చేసిన శతావధాన పూరణలు ఐదు సంపుటాలుగా– శతావధాన శారద, శతావధాన శ్రీవిద్య, శతావధాని రచనా సంచయనం, శతావధాన శాశ్వతి – వెలువడ్డాయి. "కన్నడవల్లి అవధాన కళ" గ్రంథంలో అవధానకళ పూర్వాపరాలు సమీక్షించారు. ఆంగ్లంలో THE ART AND SCIENCE OF AVADHANAM IN SANSKRIT అనే గ్రంథాన్ని గణేష్, శశికిరణ్‌లు ప్రచురించారు.

అవధాన అరంగ్రేటం: 1981 నాటిమాట..

లేపాక్షి ఓరియంటల్ కాలేజీ అధ్యాపకులు మేడవరం మల్లికార్జునశర్మ బెంగుళూరులో అష్టావధానం చేశారు. ఆనాటి సభకు కర్ణాటక హైకోర్టు రిజిస్ట్రార్ శ్రీలంకాకృష్ణమూర్తి అధ్యక్షులు(నేను 1976 జనవరి 26లో బెంగుళూరులో అష్టావధానం చేసినపుడు కూగా కృష్ణమూర్తి అధ్యక్షులు. ఆకాశవాణి అది రికార్డు చేసి ప్రసారం చేసింది)

మల్లికార్జునశర్మ అవధాన ప్రదర్శనను 18 ఏళ్ల యువకుడైన డా. గణేష్ చూసి ప్రభావితుడైనాడు. అవధాని చేసిన పూరణలన్న తన గురువు రంగనాథ శర్మ ముందు సభానంతరం గణేష్ ధారణ చేసి చెప్పాడు. గురువుగారిచ్చిన ప్రోత్సాహంతో కొద్ది రోజులకే గణేష్ అరంగేట్రం చేసి అవధాని అయ్యాడు. ఆ తర్వాత త్రిభాషాష్టావధానం – సంస్కృతం, కన్నడం, తెలుగు భాషలలో సునాయాసంగా చేయగలిగాడు.



పది సంవత్సరాలు గడిచాయి. అది 1991. గణేష్ ఒక్క రోజులో సంపూర్ణ శతావధానం పూర్తి చేశాడు. ఎనిమిది భాషలలో పూరణలు చేశారు. 2012లో మరో సంపూర్ణ శతావధానం. అందులో నాలుగో వంతు సంస్కృత పురాణాలు. మిగతా 75 కన్నడంలో. సంస్కృత, తమిళ, కన్నడ, ప్రాకృత భాషాంశాలను పృచ్ఛ÷ కులు అడిగారు. ఈయన శిష్యులను కూడా తయారు చేశారు. యువకులైన కొప్పలతోట గణేశ్ భట్ట కన్నడావధాని. డా. రామకృష్ణ పెజత్తయ్య సంస్కృతావధాని. మహేశభట్ట మరో సంస్కృతావధాని. 2014 నాటికి డా. గణేశ్ వెయ్యి ప్రదర్శనలు పూర్తి చేసి శెభాష్ అనిపించుకున్నారు.

వైవిధ్యభరితం: వీరి అవధానాలలో వ్యస్తాక్షరి నిర్దుష్టాక్షరితో బాటు చిత్ర కవిత్వం కూడా విరివిగా ప్రదర్శిస్తారు. అన్యోక్తి, చిత్రలేఖనం, భావ ప్రకాశం, శ్లోకాభినయం, గీతరచనం, మానసిక విశ్లేషణం, శ్లోకానువాదం, ఇతరభాషల పద్యానువాదం ఈయన ప్రత్యేకత. సంస్కృత నాటకాలలోని శ్లోకాలు చదివితే గణేష్ కన్నడానువాదం ఆశువుగా పలికేవారు. అది అత్యంత క్లిష్టం. వాచికాభినయంతో ఆశువుగా కన్నడంలో పద్యం అల్లగల ధీమంతుడు. కావ్యపఠనంలో ఆశువుగా కన్నడంలో పద్యం అల్లగల ధీమంతుడు. కావ్యపఠనంలో పృచ్ఛకుడు పరాగంలో పద్యం చదివాడో దానికి సమాధానంగా అదే రాగంలో చెప్పగల సంగీతజ్ఞుడు. అది ఆయన ప్రజ్ఞకు నిదర్శనం. ఆయన ఆరు శతావధానాలు చేశారు. పదివేలకుపైగా సభాప్రసంగాలు చేశారు. ఈ వివరాలు తెలిసి "ఔరా! గణేష్" అని ప్రశంసిస్తాము. (రా. గణేశ్ చరవాణి 9449089898 – బెంగళూరు)

సంస్కృతం సంస్కృతి

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

సంస్కృత జ్ఞానము ఎందుకు అంటే అది అవధానికి కావలసిన పదనిర్మాణసామర్ధ్యము సంపదలో కూడా ప్రధానపాత్ర పోషిస్తుంది. అడిగిన ఛందస్సులోని గణప్రస్తారము బట్టి ఒకే అర్థముకల పదాలు నిర్మించుకోవలసి రావచ్చును. ఇక్కడ కూడ పర్యాయపదాలపై ఆధారపడవలసి ఉన్నది. అయితే నిఘంటువులలో ఇచ్చిన పర్యాయపదాలు ఉన్నాయి కదా వాటిని వాడుకోవచ్చు. కానీ అవి కుదరనప్పుడు, లేదా ఒక కొత్తదనముతో పద్యము రసమయముగా చెప్పాలనుకున్నప్పుడు ఇట్టి సంపదకు ఆవశ్యకమైన మరొక చిన్న సంస్కృత గ్రంథము ధనంజయ నిఘంటువు. ఇందులో ఒక పదానికి కలిగిన అనేక పర్యాయ పదములు ఉంటాయి. ఒకదానితో ఒకటి కలపడం ద్వారా కొత్తపదాలు నిర్మించుకోవచ్చు. ఉదాహరణకి కమలమునకు 20 పదాలు ఉన్నాయి అనుకోండి. అలాగే ఆసనము అన్న పదానికి మరొక 15 పదాలు ఉన్నాయి అనుకోండి అంటే పద్మముపైన కూర్చున్న బ్రహ్మగారిని సూచించేవి 300 పదాలు వచ్చినట్లేగా. అలాగే అవే పదాలను పుంలింగము బదులు స్త్రీలింగములో ప్రయోగిస్తే లక్ష్మీనామాలు అవుతాయిగా. అంటే కేవలం 35 శబ్దాలతో 600 శబ్దాలు నిర్మించుకున్నామన్నమాట. ఇలాంటి పర్యాయపదాలు అవధానికి ధనంజయాది విశేష నిఘంటువులు, కోశములలో మాత్రమే లభిస్తాయి. అందుకని సంస్కృతాభ్యాసము అనివార్యము.

మరొక విషయము. వేదమును ప్రభుసమ్మితములు అంటారు. అందులో విధినిషేధములుగా చెప్పబడుతాయి. అట్టి విధినిషేధాలనే పురాణాలు కథల రూపముగా విస్తరించి మిత్రునివలె చెప్తాయి. సంస్కృతభాషలో విశేష ప్రాచీన సాహిత్య సంపద ఉన్నది. వానినే కావ్యసాహిత్యములో కాంతసమ్మితములుగా చెప్పబడినవి అంటారు. అంటే ప్రియవచనములతో సులభగ్రాహ్యముగా ఆచరణ ప్రేరకములుగా ఉంటాయి అని తాత్పర్యము. ఈ సాహిత్యమునకు ఇతివృత్తములను రెండు రకాలుగా విభజించారు లాక్షణికులు, ప్రఖ్యాతము, ఉత్పాద్యము అని. వీటి కలయికతో మూడవరకము మిశ్రమము అని. అంటే ఉత్పాద్యము తప్ప అన్నీ కూడా వేదోక్తములైన ఇతివృత్తములే అని స్పష్టము కదా. భారతీయ సంస్కృతికి మూలకందమైన వేదవిజ్ఞానము, విధినిషేధాల వివరము సామాన్యులకు కూడా బోధపరిచేవి ప్రాచీన సాహిత్యము అని అవగతమౌతున్నది కదా. ఇక తెలుగులో కూడా ప్రబంధ సాహిత్యమునకు ఇతివృత్తములు కూడా వీనినుండి గ్రహించినవే అని గమనించవచ్చు.

ఇతివృత్తము ముఖ్యమైనప్పటికీ కేవలము శబ్దార్థములు పోగు వేసిన రచన కాలానికి నిలువదు. అంటే వాక్య, పద్యనిర్మాణములో నైపుణ్యము చూపాలి. ప్రాచీన సాహిత్యములో ఈ అంశాలకు ఉదాహరణలు రాశులుగా పోయబడి మనకి లభించేవి కోకొల్లలు. పద్యము కావ్యత్వమును ఎందుకు పొందినది, రసస్ఫోరకత ఎలా వచ్చినది, అలంకారములు ఎలా అంతర్భవించేలా వ్రాసారు అనేవి అనేక అంశాలు తెలుస్తాయి.

అవధానక్రీడ కేవల వినోదమునకు కాదు. వినోదముతో పాటుగా విజ్ఞానము కూడా పంచబడుతుంది. పైగా భావగాంభీర్యములేని కేవల పదపూరణలతో చేసిన అవధానములో సమాధానములు సరిగా ఉన్నప్పటికీ ప్రేక్షకులకు మానసికానందము ఎక్కువగా కలుగచేయదు. ఒక సమాసనిర్మాణమో, ఒక పద్యములోని భావ గంభీరతయో, నీతిబోధయో, విశేషవృత్తములో చెప్పుటయో ఇలా ఏదో ఒక ప్రత్యేకత కోసం ఎదురుచూస్తారు. అది కనబడ్డప్పుడు అవధాని ప్రతిభని విశేషముగా ప్రశంసించుట అనుభవమే కదా. మనం గమనించినట్లైతే పూర్వావధానులందరూ సంస్కృతములో విశేషపాండిత్యము కలవారే. వారి పద్యాలలో పై అంశాలన్నీ పరిపుష్టమైనవని గమనించవచ్చు. కనుక వారి బాటలో నడుచుట నవీనావధానులకు ఆవశ్యకమే కదా. మరొక కోణములో సంస్కృత సాహిత్యము యొక్క ఆవశ్యకత మరొక సారి చూసే ప్రయత్నం చేద్దాం. ప్రస్తుతానికి స్వస్తి. **(సశేషం)**

తటిల్లతలు

ప్ర: మామిడిపలి సామబార్యుని
నేమని వర్ణింతురొక్కొ యింపుగ జెపుడీ

స: మా మిడి మిడి తలపులతో
నేమని వర్ణించగలుగు దీశ్వరసమునిన్


ప్ర: ఎల్లమల్లె లెక్కడయినా చూశారా?

స: ఇంకా సిద్ధిపేటకు రాలేదు (ఎల్లమల్లెలు - ఒక సినిమా)

ప్ర: ప్రేమకు, దోమకు పోలిక చెప్పెదరా?

స: నిద్ర పట్టకుండా చేయడం

(అష్టకాల నరసింహరామశర్మ గారి 'అవధాన సరస్వతి' నుండి)





పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి చేతులమీదుగా


02.11.2025 తేదీన **జానుమద్ది హనుమచ్ఛాస్త్రి పురస్కారాన్ని** అందుకుంటున్న

పంచసహస్రావధాని **డా. మేడసాని మోహన్**

మరియు

విఖ్యాత అవధాని **డా. రేవూరి అనంతపద్మనాభరావు**

అవధాన విద్యా విజయతే తరామ్



Published by
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146